News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

# CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 04 | సంచిక :349 | ఖమ్మం | గురువారం జనవరి 29, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad



## మహారాష్ట్ర రాజకీయాల్లో
# తీరని విషాదం

- ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ దుర్మరణం
- జిల్లా పరిషత్ ఎన్నికల ప్రచారానికి వెళుతుండగా దుర్ఘటన
- బారామతిలో అదుపుతప్పి విమానం ల్యాండ్ క్రాష్
- రన్వే పై ఎమర్జెన్సీ ల్యాండింగ్కు విఫలయత్నం.. రాయిని ఢీకొట్టడంతో విస్ఫోటనం
- అగ్నిగోళంలా జ్వాలలు. అజిత్ తోపాటు మరో నలుగురి మృతి
- మహారాష్ట్ర ప్రజలకు తీరని లోటు అజిత్ మృతిపట్ల ప్రధాని మోడీ దిగ్భ్రాంతి



వివరాలు 2లో..

# వికసిత్ భారత్ వైపు దేశం పయనిస్తోంది

## పదేళ్లలో పేదల కోసం 4కోట్ల ఇళ్ల నిర్మాణం



- జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామాలకు తాగునీరు
- వందేభారత్, అమృత్ భారత్ రైళ్ల ద్వారా సేవలు
- ఆయుష్మాన్ భారత్ తో కోట్లమందికి వైద్యం
- పరిధాన్యం ఉత్పత్తిలో ప్రపంచంలో నంబర్ వన్
- అక్వా, పాల ఉత్పత్తుల్లో భారత్ ముందంజ
- 11 ఏళ్లలో భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి
- పవర్ టెక్నాలజీ హబ్ గా రూపొందుతున్న భారత్
- గీన్ ఎనర్జీ రంగంలో పవర్ హౌస్ గా భారత్
- ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం

దేశం వికసేత్ భారత్ వైపు పయనిస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చెప్పారు. పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, గత పదేళ్లలో పేదల 1 కోసం 4కోట్ల ఇళ్లు కట్టించానని, జల్ జీవన్ మిసన్ ద్వారా గ్రామాలకు తాగునీరు అందిస్తున్నామని రాష్ట్రపతి తెలిపారు. పదేళ్లలో 25కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చాం. సామాజిక న్యాయం ప్రాతిపదికన కేంద్రం పనిచేస్తోందన్నారు

వివరాలు 2లో..



# వనమంతా జనమయం..

## గద్దెనెక్కిన సారలమ్మ.. పోటెత్తిన భక్తజనం

- శివాలెత్తిన మేడారం మహా జాతర
- ఆదివాసీ గిరిజన సంప్రదాయాలతో కన్నెపల్లి గుడిలో ప్రత్యేక పూజలు
- సారలమ్మకు మంగళ హారతులతో మహిళల స్వాగతం
- తరలి వచ్చిన మంత్రులు సీతక్క, అడ్లూరి లక్ష్మణ్
- జంపన్నవాగులో భక్తుడి గల్లంతు



వివరాలు 2లో..

వనమంతా జనమ యమైంది. అమ్మవార్ల ఆగమనంతో మేడారం పులకరిం చింది.. కోట్లాది మంది భక్తులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసిన ఉద్విగ్న క్షణాలు రానే వచ్చాయి. భక్తుల జయజ యధ్వానాల నడుమ కన్నెపల్లి నుంచి వచ్చిన సారలమ్మ.. పునుగండ్ల నుంచి వచ్చిన పగిడిద్దరాజు... కొండాయ్ నుంచి వచ్చిన గోవిందరాజులు గద్దెలపై కొలువుదీరడంతో మహా జాతరకు పూర్తిశోభ చేకూరినట్టయింది.



## ఆధార్‌ను తిరస్కరించడం
# సరికాదు

### 'సర్' పిటిషన్ల కేసులో సుప్రీం వ్యాఖ్య

దిల్లీ: ఓటరు జాబితాల్లో మార్పు చేర్పులు ఎన్నికల సంఘం చేపట్టే సవరణ కసరత్తులో భాగమేనని సుప్రీంకోర్టు బుధవారం పేర్కొంది. బిహార్‌లో జరిగిన ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ(సర్)పై దాఖలైన 19 పిటిషన్లపై విచారణను కొనసాగిస్తూ కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఫోర్జరీకి అవకాశం ఉందన్న కారణం చూపి ఆధార్‌ను ఓటరు నమోదుకు కావాల్సిన ప్రామాణిక పత్రాల్లో ఒకటిగా గుర్తించకపోవడం

వివరాలు 2లో..

# చర్చలకు వస్తారా.. నాశనం అవుతారా

## ఇరాన్‌కు ట్రంప్ తీవ్ర హెచ్చరిక



వాషింగ్టన్: అణు ఒప్పందంపై చర్చలకు రాని పక్షంలో ఇరాన్‌పై భీకర స్థాయిలో విరుచుకుపడతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం హెచ్చరించారు. "అణు ఒప్పందం కోసం

వివరాలు 2లో..

## నగరపాలికలన్నీ నెగ్గేలా..
# కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి

- మంత్రులు, ముఖ్య నేతలకు ప్రచార బాధ్యతలు
- గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ముఖ్య నేతలకు సీఎం పిలుపు

మున్సిపల్ ఎన్నికల్లో మొత్తం ఏడు కార్పొరేషన్లను దక్కించుకోవాలని అధికార కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రస్థాయిలో ముఖ్యనేతలను ఎంపిక చేసి వాటిలో ప్రచార బాధ్యతలను అప్పగించింది. ప్రతి కార్పొరేషన్‌కు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ప్రచార వ్యూహం

వివరాలు 2లో..





# నేను ఇప్పటికీ భారత రాష్ట్ర సమితి సభ్యుడినే

- పార్టీకి రాజీనామా చేయలేదు
- నాపై ఎలాంటి సస్పెన్షన్.. బహిష్కరణ ఉత్తర్వుల్లేవు
- అనర్హత పిటిషన్ అసత్య ఆరోపణే
- స్పీకర్‌కు దానం నాగేందర్ అఫిడవిట్
- 30న విచారించనున్న సభాపతి

వివరాలు 2లో..

## నయీం కేసులో కీలక పరిణామం..
# కోర్టులో ఈడీ ఛార్జిషీట్



- నయీం మనీలాండరింగ్ కేసులో ఈడీ ఛార్జిషీట్
- విచారణకు స్వీకరించిన రంగారెడ్డి కోర్టు
- మొత్తం 10 మందిపై అభియోగాలు.. రూ.11.30 కోట్ల ఆస్తుల గుర్తింపు
- నయీం భార్య, కుటుంబ సభ్యుల పేర్ల ప్రస్తావన
- నిందితులపై నాన్-బెయిలబుల్ వారెంట్లు జారీ చేయాలని ఈడీ వినతి

వివరాలు 2లో..

# మహారాష్ట్రలో కుప్పకూలిన విమానం
# డిప్యూటీ సీఎం అజిత్ పవార్ దుర్మరణం

ముంబై: మహారాష్ట్రలో విమానం కుప్పకూం ఘటనలో ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ (66) సహా మరో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. జిల్లా పరిషత్ ఎన్నికల ప్రచారం నిమిత్తం ముంబై నుంచి బారామతి వెళ్తుండగా ఉదయం 8.45 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది.

సాంకేతిక లోపం కారణం గానే ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోం ది. ముంబై నుంచి బయల్దేరిన గంట తర్వాత విమానంలో సమస్య తలెత్తింది. ఎమర్జెన్సీ ల్యాండింగ్ సమయంలో విమానం అదుపుతప్పి కూలిపోయింది. ఆ వెంటనే భారీగా మంటలు చెలరేగాయి. ప్రమాద తీవ్రతకు విమానం రెండు ముక్కలైనట్లు సమాచారం. విమాన ప్రమాదం పై డీజీసీఏ స్పందించింది. విమానంలో ఎవరూ బతికి లేరని వెల్లడించింది. అజిత్ పవార్, ఇద్దరు వ్యక్తిగత సిబ్బంది, ఇద్దరు విమాన సిబ్బంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపింది. అజిత్ పవార్ 1959 జులై 22న జన్మించారు. ఆయన తండ్రి అనంత్రావ్ పవార్.. మహారాష్ట్ర మాజీ సీఎం శరద్ పవార్కు సోదరుడు. బాబాయి శరద్ పవార్ అడుగుజాడల్లో రాజకీయాల్లో కి అడుగుపెట్టిన అజిత్పవార్.. 1982లో తొలిసారి కార్పొరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ బోర్డుకు ఎన్నికయ్యారు. ఆ తర్వాత 16 ఏళ్ల పాటు పుణె జిల్లా సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్గా వ్యవహరించారు. 1991లో తొలిసారి బారామతి పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి లోక్సభకు ఎన్నికయ్యారు. అనంతరం శరద్ పవార్ కోసం ఆ సీటును త్యాగం చేసి.. రాష్ట్ర రా జకీయాల్లోకి వచ్చారు. 1991 ఉప ఎన్నికల్లో బారామతి అసెంబ్లీ స్థానం నుంచి గెలుపొం దారు. ఈ నియోజకవర్గం నుంచి ఏడుసార్లు మహారాష్ట్ర ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ప్రస్తుతం సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు.

# వికసిత్ భారత్ వైపు దేశం పయనిస్తోంది

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈరోజు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఢిల్లీలోని పార్లమెంట్లో లోక్సభ, రాజ్యసభ సభ్యులతో కూడిన ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ నెల 29న (గురువారం) ఆర్థిక సర్వేను, ఫిబ్రవరి 1న (ఆదివారం) కేంద్ర బడ్జెట్ను ప్రవేశపెట్టనున్నారు.

ఈ సందర్భంగా రాష్ట్రపతి ముర్ము మాట్లాడుతూ.. గడిచిన ఏడాది వేగవంతమైన ప్రగతి, గొప్ప సాంస్కృతిక వారసత్వానికి గుర్తుగా నిలిచిపోయిం దన్నారు. 'వికసిత్ భారత్' నిర్మాణంలో 2026వ సంవత్సరం ఒక కీలకమైన పునాది సంవత్సరంగా నిలుస్తుందని ఆమె అభివర్ణించారు. గత దశాబ్ద కాలంలో భారత్ అన్ని ప్రధాన రంగాలలో తన పునాదులను పటిష్ఠం చేసుకుందని, భవిష్యత్ వృద్ధికి బలమైన మార్గాన్ని నిర్మించుకుందని పేర్కొన్నారు.బంకించంద్ర ఛటర్జీ రచించిన 'వందేమాతరం' గీతం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న వేడుకలను ఆమె గుర్తుచేశారు. శ్రీ గురు తేజ్ బహదూర్ జీ 350వ షహీదీ దివస్, బిర్సా ముండా, సర్దార్ వల్లభ్భాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలను ప్రస్తావించారు. దేశం తన పూర్వీకుల సేవలను గౌరవించుకున్నప్పుడు, యువతరంలో స్ఫూర్తి రగులుతుందని, అది అభివృద్ధి చెందిన భారత్ దిశగా దేశ ప్రయాణాన్ని

వేగవంతం చేస్తుందని రాష్ట్రపతి తెలిపారు. కాగా, సమావేశాలకు ముందు మంగళవారం రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగింది. సభా కార్యకలాపాలు సజావుగా సాగేందుకు సహకరిస్తామని నేతలు హామీ ఇచ్చారు. ఓట్ల దొంగతనం ఆరోపణలు, ఓటర్ల జాబితా సవరణ, ధాన్యం సేకరణ, ఉపాధి హామీ పథకం వంటి ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తామని కాంగ్రెస్ పార్టీ ఈ సమావేశంలో తెలిపింది.

# నగరపాలికలన్నీ నెగ్గేలా..
# కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి

- మొదటి పేజీ తరువాయి
రచించి పోరాడాలని నిర్ణయించింది. నిజామాబాద్, కరీంనగర్, నల్గొండ, కొత్తగూడెం, మంచిర్యాల, మహబూబ్నగర్, రామగుండం కార్పొరేషన్లకు ఎన్నికలు జరుగుతున్నాయి. గత మున్సిపల్ ఎన్నికల సమయంలో నిజామాబాద్, కరీంనగర్, రామగుండం కార్పొరేషన్లు కాగా... ఈసారి మిగిలినవీ నగరపాలక సంస్థలుగా మారాయి.

**నిజామాబాద్, కరీంనగర్లలో...**

నిజామాబాద్, కరీంనగర్లలో భాజపా, భారత రాష్ట్ర సమితిలతో త్రిముఖ పోరు ఎదురవుతుందని కాంగ్రెస్ వర్గాల అంచనా. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభావం పెద్దగా లేని ఈ రెండు కార్పొరేషన్లను దక్కించుకునేందుకు సీనియర్ మంత్రులు ఉత్తమ్కుమార్రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులకు పార్టీ.. ఇన్ఛార్జి బాధ్యతలు అప్పగించింది. స్థానిక నేతలందరినీ సమన్వయపరిచి గెలుపు దిశగా పార్టీని నడిపేందుకు వారి అనుభవం ఉపకరిస్తుందని నేతలు చెపుతున్నారు. కరీంనగర్లో గత ఎన్నికల్లో కాంగ్రెస్కు ఒక్క డివిజన్ కూడా దక్కలేదు. ఇన్ఛార్జి తుమ్మల, ఈ ఉమ్మడి జిల్లా మంత్రులు శ్రీధర్బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్లు ఇక్కడ గెలుపును వ్యక్తిగత ప్రతిష్ఠగా తీసుకుని ప్రచార బాధ్యతలు నిర్వహించాలని పార్టీ సూచించింది. కరీంనగర్లో భాజపా తరఫున కేంద్ర మంత్రి బండి సంజయ్, భారత రాష్ట్ర సమితి తరఫున మాజీ మంత్రి గంగుల కమలాకర్కు పట్టున్నందున వారి వ్యూహాలకు దీటుగా పనిచేయాలని ఇన్ఛార్జి మంత్రి తుమ్మల పార్టీ శ్రేణులను సమాయత్తపరుస్తున్నారు.

**ప్రముఖుల సొంత జిల్లాల్లో...**

నిజామాబాద్.. పీసీసీ అధ్యక్షుడు మహేశ్కుమార్గౌడ్, మహబూబ్నగర్.. సీఎం రేవంత్రెడ్డి, నల్గొండ.. మంత్రి కోమటిరెడ్డి సొంత ఉమ్మడి జిల్లా కేంద్రాలవడంతో వీటిల్లో గెలుపు పార్టీకి ప్రతిష్ఠాత్మకంగా మారింది. నిజామాబాద్లో నెగ్గడానికి మహేశ్కుమార్గౌడ్, అక్కడ ఇన్ఛార్జి మంత్రి ఉత్తమ్, ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్రెడ్డి, షబ్బీర్అలీ దృష్టిపెట్టారు. ఈ నగరంలో మజ్లిస్కు కూడా పట్టున్నందున ఆ పార్టీతో సమన్వయం చేసుకుంటే నగరపాలక సంస్థ దక్కుతుందని కాంగ్రెస్ అంచనా. మహబూబ్నగర్లోని కొన్ని డివిజన్లలో భాజపా, భారత రాష్ట్ర సమితిలతో త్రిముఖపోరు, మిగిలినచోట్ల భారత రాష్ట్ర సమితితో ప్రధాన పోటీ ఉంటుందని కాంగ్రెస్ భావిస్తోంది. సీఎం సొంత జిల్లా కేంద్రం కావడంతో ముఖ్యనేతలు ప్రచారంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. నల్గొండ నుంచి మంత్రి కోమటిరెడ్డి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నందున నగరపాలక సంస్థలో పార్టీని గెలిపించాలని నేతలు ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన 24 గంటల్లోనే... మొత్తం 48కి 45 డివిజన్లకు కాంగ్రెస్ అభ్యర్థులను ఆయన ప్రకటించారు. భాజపా, భారత రాష్ట్ర సమితిలు ఈ నగరంలో గతంలో మున్సిపాలిటీని నెగ్గినా ఈసారి నగరపాలకసంస్థగా జరుగుతున్న తొలి ఎన్నికల్లో గెలిచి చరిత్ర సృష్టించాలని కాంగ్రెస్ యత్నిస్తోంది.

కొత్తగూడెంలో మిత్రపక్షమైన సీపీఐ 27 డివిజన్లను పొత్తులో కేటాయించాలని కాంగ్రెస్ను అడుగుతోంది. పొత్తు పంపకాలు తేలి కలిసి పోటీచేస్తే నగరపాలక సంస్థ దక్కుతుందనేది అధికార పార్టీ అంచనా. ఇక్కడ భారత రాష్ట్ర సమితితోనే ప్రధాన పోటీ అని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

రామగుండం, మంచిర్యాలలో బొగ్గు గనుల కార్మికుల ఓట్లు అధికంగా ఉన్నందున వారి సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పనులపై నేతలు ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రంలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో కార్పొరేషన్లు నెగ్గుతామని మహేశ్కుమార్గౌడ్ చెప్పారు.

**ఏకాభిప్రాయంతో అభ్యర్థుల ఎంపిక జరిగేలా చూడండి: సీఎం రేవంత్రెడ్డి**

అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్రెడ్డి.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్రెడ్డి తదితర నేతలతో మాట్లాడుతూ అత్యధిక మున్సిపాలిటీలతో పాటు, కార్పొరేషన్లన్నీ నెగ్గేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని

దిశానిర్దేశం చేశారని సమాచారం. లోపాలు తలెత్తకుండా అభ్యర్థులను ఎంపిక చేయాలని చెప్పినట్లు తెలుస్తోంది. లోక్సభ నియోజకవర్గాలకు ఇన్ఛార్జులుగా నియమితులైన మంత్రులతోపాటు ఇతర ముఖ్య నేతలంతా క్షేత్ర స్థాయిలోనే ఉంటూ పార్టీ తరఫున ప్రచారం నిర్వహించాలని సీఎం స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.

ఇన్ఛార్జి మంత్రి.. స్థానిక నేతలతో చర్చించి ఏకాభిప్రాయంతో అభ్యర్థుల ఎంపిక జరిగేలా చూడాలని నిర్దేశించారని తెలిసింది. అమెరికా నుంచి తిరిగి వచ్చిన తరవాత వచ్చే నెల 3 నుంచి వరసగా రోజుకో బహిరంగ సభలో సీఎం ప్రసంగించనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. 3న తొలుత మిర్యాలగూడ, 4న జగిత్యాల, 5న చేవెళ్ల, 6న భూపాలపల్లి, 7న మెదక్, 8న నిజామాబాద్లలో జరిగే కాంగ్రెస్ ఎన్నికల సభల్లో రేవంత్రెడ్డి పాల్గొనే అవకాశాలున్నట్లు తెలిపాయి. సీఎం అమెరికా నుంచి తిరిగి వచ్చిన తరవాత ఈ పర్యటన వివరాలను పార్టీ అధికారికంగా విడుదల చేయనుంది.

# వనమంతా జనమయం..
# గద్దెనెక్కిన సారలమ్మ.. పోటెత్తిన భక్తజనం

మేడారం: తెలంగాణ కుంభమేళా బుధవారం జనసంద్రమైంది. మేడారం వనజాతరలో తొలిరోజు సారలమ్మను గద్దెల ప్రాంగణానికి కోలాహలంగా ఆహ్వానించారు. ఈ మహాక్రతువును కనులారా తిలకించేందుకు లక్షల మంది భక్తులు పిల్లాపాపలతో కలిసి ఎడ్లబండ్లు, బస్సులు, వాహనాల్లో తరలివచ్చారు. మొదట... మేడారానికి మూడున్నర కిలోమీటర్ల దూరంలో కన్నెపల్లిలో ఉన్న ఆలయంలో ఉదయం ప్రధాన పూజారి కాక సారయ్య ఆధ్వర్యంలో సారలమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ ఆడపడుచులు ప్రాంగణంలో రంగురంగుల ముగ్గులు వేశారు. మంత్రులు సీతక్క, అడ్లూరి లక్ష్మణ్కుమార్, ములుగు కలెక్టర్ దివాకర, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అధికార యంత్రాంగంతో కన్నెపల్లి చేరుకొన్నారు. రాత్రి 7:40 గంటలకు కన్నెపల్లి ఆలయం నుంచి సారలమ్మను బయటకు తీసుకొచ్చే సమయంలో శివసత్తులు పూనకాలతో ఊగిపోయారు. ఆదివాసీలు నృత్యాలు చేస్తూ, కొమ్ము బూర ఊదుతుండగా మంత్రులు, అధికారులు సైతం తన్మయత్వంతో పరవశిస్తూ అమ్మవారికి ఆహ్వానం పలికారు.

ఆలయం బయట భక్తులు వరం పడుతూ, పొర్లుదండాలు పెడుతుండగా... పూజారులు వెదురుబుట్టలో సారలమ్మను తీసుకొని వారి పైనుంచి నడుచుకుంటూ వచ్చారు. అత్యంత భావోద్వేగంతో సాగిన ఈ ఘట్టాన్ని చూసి పులకరించిన భక్తులు వనదేవతకు జేజేలు పలికారు. అక్కడి నుంచి మూడంచెల పోలీసుల భద్రత మధ్య పూజారులు మేడారానికి బయలుదేరారు. మార్గంమధ్యలో జంపన్నవాగును దాటుకుంటూ... మేడారంలోని సమ్మక్క గుడికి చేరుకున్నారు. అప్పటికే అక్కడ పగిడిద్దరాజు, గోవిందరాజులతో వారి పూజారులు సిద్ధంగా ఉన్నారు. సారలమ్మ రాగానే ముగ్గురు దేవతల పూజారులు ప్రత్యేక పూజలు చేశాక గద్దెల వద్దకు తరలారు. ప్రాంగణం వద్ద ఎదుర్కోలు నిర్వహించి, ముగ్గురినీ అర్ధరాత్రి దాటాక గద్దెలపై కొలువు దీర్చారు. వనదేవతల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని కనులారా తిలకించేందుకు భక్తులు పోటీపడ్డారు.

**సేవలో 40 వేల సిబ్బంది**

ఐజీ చంద్రశేఖర్రెడ్డి నేతృత్వంలో 13 వేల మంది పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతను కల్పించింది. మరోవైపు 42 సెక్టార్లలో 21 శాఖలకు చెందిన 40 వేల మంది సిబ్బంది జాతర విధుల్లో భాగస్వాములయ్యారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం హైదరాబాద్లోని సచివాలయం నుంచి హై ఫ్రీక్వెన్సీ వాకీటాకీతో మేడారంలో ట్రాఫిక్ విధుల్లో ఉన్న సిబ్బందితో మాట్లాడారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనిచేయాలని సూచించారు.

**వేల వాహనాలు... లక్షల్లో భక్తులు**

జాతర మొదటి రోజునే భక్తులు భారీగా తరలివచ్చారు. 50 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణానికి వందలాది బస్సులు వచ్చాయి. ప్రైవేటు వాహనాల కోసం ఏర్పాటుచేసిన 1,462 ఎకరాల పార్కింగ్ స్థలాలు పూర్తిగా నిండిపోయాయి. జంపన్న వాగు వద్ద భక్తులు భారీ సంఖ్యలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఆలయం వద్ద క్యూలైన్లు కిక్కిరిసి పోయాయి.

# చర్చలకు వస్తారా.. నాశనం అవుతారా

- మొదటి పేజీ తరువాయి
ఇరాన్ త్వరగా చర్చలకు వస్తుందని భావిస్తున్నాను. అణ్వాయుధాలను నిషేధించే ఒప్పందం అందరికీ మేలు చేస్తుంది. భారీగా యుద్ధ నౌకలు ఇరాన్వైపు గొప్ప శక్తితో, ఉత్సాహంతో, వేగంతో, ఓ లక్ష్యంతో వెళుతున్నాయి. సమయం లేదు. ఒప్పందం కుదుర్చుకోవాలని ఇరాన్కు మరోసారి చెబుతున్నా" అని 'ట్రూత్ సోషల్'లో ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ చర్చలకు రాకపోతే గతంలో కంటే భీకరస్థాయిలో దాడులు చేస్తాం.. నాశనం తప్పదని హెచ్చరించారు.మరోవైపు అమెరికా దాడికి సిద్ధమవుతున్న సూచనలు కనిపిస్తుండటంతో పశ్చిమాసియా దేశాల మద్దతు కూడగట్టే పనిలో ఇరాన్ నిమగ్నమైంది. ఇరాన్పై దాడికి అమెరికా తమ ఆకాశ మార్గాన్ని వినియోగించడానికి అనుమతించబోమని సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్లు భరోసా ఇచ్చాయని తెలిసింది. ట్రంప్ హెచ్చరికపై ఇరాన్ ఘాటుగా స్పందించింది. తమను యుద్ధం దిశగా నెడితే.. గతంలో ఎన్నడూ చేయని స్థాయిలో దాడి చేస్తామంది. తాము చర్చలకు సిద్ధంగా ఉన్నామని పేర్కొంది.

# ఆధార్ను తిరస్కరించడం సరికాదు

- మొదటి పేజీ తరువాయి
సరికాదని స్పష్టం చేసింది. "చట్టం గుర్తించిన పత్రాన్ని జారీ చేసే ప్రక్రియలో ప్రైవేటు సంస్థ ప్రమేయం ఉందన్న కారణంగా ఆ పత్రానికి గుర్తింపు నిరాకరించడం సరికాదు" అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్మల్యా బాగ్చీలు పేర్కొన్నారు. పాస్పోర్టును జారీ చేసే ప్రక్రియలోనూ ప్రైవేటు సంస్థల ప్రమేయం ఉందని గుర్తు చేశారు. ఓటరు జాబితా నుంచి భారీగా ఓటర్ల పేర్లు తొలగించారని సీనియర్ న్యాయవాది కపిల్సిబల్ పేర్కొనగా "ఓటరు జాబితా సవరణ కసరత్తులో మార్పు చేర్పులు భాగమే"అని న్యాయమూర్తులు అన్నారు.

## నయీం కేసులో కీలక పరిణామం..
# కోర్టులో ఈడీ ఛార్జిషీట్

ఏపీ, తెలంగాణలో సంచలనం సృష్టించిన గ్యాంగ్స్టర్ నయీం అక్రమాస్తుల కేసులో ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కీలక ముందడుగు వేసింది. మనీలాండరింగ్ ఆరోపణలపై హైదరాబాద్లోని రంగారెడ్డి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసింది. మనీ లాండరింగ్ నివారణ చట్టం-2002 కింద దాఖలు చేసిన ఈ ఛార్జిషీట్ను పరిశీలించిన న్యాయస్థానం, విచారణకు స్వీకరించింది.ఈ కేసులో పాశం శ్రీనివాస్తో సహా మొత్తం 10 మందిపై ఈడీ అభియోగాలు మోపింది. నయీం గ్యాంగ్ బెదిరింపులు, బలవంతపు రిజిస్ట్రేషన్ల ద్వారా సంపాదించిన సుమారు రూ.11.30 కోట్ల విలువైన 91 ఆస్తులను 'ప్రొసీడ్స్ ఆఫ్ క్రైమ్'గా గుర్తించింది. ఈ ఆస్తులను నయీం తన భార్య హసీనా బేగం, ఇతర కుటుంబ సభ్యులు, సన్నిహితుల పేర్లపై బినామీలుగా రిజిస్టర్ చేసినట్లు దర్యాప్తులో నిర్ధారించింది.అనేకసార్లు నోటీసులు జారీ చేసినా నిందితులు విచారణకు హాజరుకాకపోవడం, ఆదాయపు పన్ను రిటర్న్స్ (ఐటీఆర్) కూడా దాఖలు చేయకపోవడంతో ఈడీ కఠిన చర్యలకు ఉపక్రమించింది. విచారణకు రాని వారిపై నాన్-బెయిలబుల్ వారెంట్లు జారీ చేయాలని కోర్టును కోరినట్లు సమాచారం. ఇప్పటికే ఈ 91 ఆస్తులను బినామీ చట్టం కింద ఐటీ శాఖ అటాచ్ చేసింది. తాజాగా ఈడీ కూడా వీటి జప్తునకు అనుమతి ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది.ఈ కేసులో నయీంకు సహకరించిన కొందరు రాజకీయ నాయకులు, పోలీసు అధికారుల ఆర్థిక లావాదేవీలపైనా ఈడీ దృష్టి సారించింది. కోర్టు ఛార్జిషీట్ను విచారణకు స్వీకరించిన నేపథ్యంలో నిందితులకు త్వరలోనే నోటీసులు జారీ అయ్యే అవకాశం ఉంది.

## నేను ఇప్పటికీ భారత రాష్ట్ర సమితి సభ్యుడినే

తాను ఇప్పటికీ భారత రాష్ట్ర సమితి సభ్యుడినే అని, పార్టీకి రాజీనామా చేయలేదని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పష్టంచేశారు. తనపై పార్టీ... ఎలాంటి సస్పెన్షన్, బహిష్కరణ ఉత్తర్వులు కూడా జారీ చేయలేదని ఆయన పేర్కొన్నారు. తనపై ఎమ్మెల్యే పాడి కౌశిక్రెడ్డి దాఖలు చేసిన అనర్హత పిటిషన్ పూర్తిగా అసత్య ఆరోపణలే అని దానం తెలిపారు. ఊహాగానాలు, మీడియా కథనాలపై ఆధారపడి ఈ ఆరోపణలు చేసినట్లుగా ఉందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి తరఫున శాసనసభ్యుడిగా గెలిచి... కాంగ్రెస్లోకి ఫిరాయింపునకు పాల్పడ్డారని దానం నాగేందర్పై భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే పాడి కౌశిక్రెడ్డి... స్పీకర్కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద దానంను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించాలని కోరారు. దానంపైనే భాజపా ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్రెడ్డి సైతం అనర్హత పిటిషన్ వేశారు. ఈ ఇద్దరి పిటిషన్లపై ఈ నెల 30న స్పీకర్ విచారణ జరపనున్నారు.

**కాంగ్రెస్ నేతలతో భేటీపై దానం వివరణ**

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్కుమార్కు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సమర్పించిన అఫిడవిట్లో పలు అంశాలకు వివరణ ఇచ్చారు. "2024 మార్చి 15న కాంగ్రెస్ నేతలతో జరిగిన భేటీని ఆధారంగా చేసుకొని.. నాపై అనర్హత పిటిషన్ దాఖలు చేశారు. ఇది పూర్తిగా తప్పుదారి పట్టించే చర్య. ఇది మర్యాద పూర్వకంగా కలిసిన వ్యక్తిగత భేటీ మాత్రమే. దాన్ని పార్టీ మార్పుగా, సభ్యత్వం వదిలేసినట్లుగా భావించడం చట్టపరంగా నిలబడదు. ప్రస్తుత పిటిషన్లో కీలకమైన వాస్తవాలు, సరైన డాక్యుమెంట్లు, ధ్రువీకరణలు లేవు. మీడియా కథనాల క్లిప్పింగులను మాత్రమే జతచేశారు. అందువల్ల నియమావళి ప్రకారం... ఈ పిటిషన్ను ప్రాథమిక దశలోనే కొట్టివేయాలి. నాపై ఉన్న ఆరోపణలు శాసనసభ వెలుపల జరిగిన వ్యక్తిగత చర్యలకు సంబంధించినవి. వాటికి సభలో నా విధులు, ఓటింగ్తో ఎలాంటి సంబంధం లేదు. పదో షెడ్యూల్ ప్రకారం... చర్యలు తీసుకోవడం శాసనసభలో జరిగే చర్యలకే పరిమితమై ఉంటుంది. వ్యక్తిగత జీవితానికి వర్తింపజేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. సహేతుకం కాని, లోపాలతో కూడిన ఈ పిటిషన్ను కొట్టివేయగలరు" అని దానం తన పిటిషన్లో పేర్కొన్నారు.

**31 వరకు సుప్రీం గడువు**

భారత రాష్ట్ర సమితికు చెందిన 10 మంది శాసనసభ్యులు కాంగ్రెస్లో చేరారని, ఫిరాయింపుల నిరోధక చట్టం కింద వారిని అనర్హులుగా ప్రకటించాలని స్పీకర్కు భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, జగదీశ్రెడ్డి, చింతా ప్రభాకర్, వివేకానంద, కౌశిక్రెడ్డి ఫిర్యాదులు చేశారు. వీటిపై స్పీకర్ నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేస్తున్నారంటూ.. భారత రాష్ట్ర సమితి న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. దీనిపై విచారించిన సుప్రీంకోర్టు... ఫిర్యాదులపై నిర్ణయం తీసుకోవడానికి స్పీకర్కు ఒకసారి మూడు నెలలు, తర్వాత మరో నాలుగు వారాలు, తాజాగా రెండు వారాల గడువిచ్చింది. ఇప్పటివరకు 8 మందిపై విచారణ పూర్తయింది. ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, బండ్ల కృష్ణమోహన్రెడ్డి, గూడెం మహిపాల్రెడ్డి, టి.ప్రకాశ్గౌడ్, అరెకపూడి గాంధీ, పోచారం శ్రీనివాసరెడ్డి, కాలె యాదయ్యలపై దాఖలైన అనర్హత పిటిషన్లను డిస్మిస్ చేస్తూ స్పీకర్ తీర్పు ప్రకటించారు.

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్పైనా విచారణ పూర్తయినా.. నిర్ణయం స్పీకర్ వద్ద రిజర్వులో ఉంది. కడియం శ్రీహరిపై చేసిన ఫిర్యాదులోనూ ఇరుపక్షాలు శాసనసభాపతికి అఫిడవిట్లను సమర్పించాయి. దీనిపై విచారణ జరగాల్సి ఉంది. సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు ఈ నెల 31తో ముగియనుంది. ఈ నేపథ్యంలో స్పీకర్ నోటీసులకు ఎమ్మెల్యే దానం నాగేందర్ సమాధానం ఇవ్వడం... దాన్ని 27న ఫిర్యాదుదారులకు స్పీకర్ కార్యాలయం పంపించడం చకాచకా జరిగిపోయాయి. దానం నాగేందర్ ఇచ్చిన వివరణపై అభ్యంతరాలు, ఆధారాలుంటే ఈ నెల 30లోపు అఫిడవిట్ రూపంలో అందజేయాలని వారిని కోరింది. శుక్రవారం(30న) ఉదయం 10.30 గంటలకు పాడి కౌశిక్రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుపై... 12 గంటలకు మహేశ్వర్రెడ్డి చేసిన ఫిర్యాదుపై సభాపతి విచారణ చేయనున్నారు.

# సికే న్యూస్ దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.స్థానిక చింతకాని పోలీస్ స్టేషన్ లో సికే న్యూస్ దినపత్రిక క్యాలెండర్ ఎస్సై ఆవిష్కరించారు .ఈ సందర్భంగా ఎస్సై వీరేందర్ మాట్లాడుతూ నేటి ఆధునిక ప్రపంచంలో డిజిటల్ మీడియాలో సికే న్యూస్ దినపత్రిక నిలిచిందని పత్రిక రంగంలో సరికొత్త మార్పులకు సికె న్యూస్ పేపర్ చుట్టిందని ఎస్సై వీరేందర్ అన్నారు. ప్రజలను చైతన్యవంతులను చేయడంలో పత్రికలు ముందు ఉన్నాయని ప్రజా సమస్య పరిష్కరించడంలో ప్రజలకు ప్రభుత్వానికి వారదిగా పని చేయాలని జర్నలిస్టులు బాధ్యత పనిచేసి సమాజానికి ఉపయోగపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సి కే న్యూస్ రిపోర్టర్ గుడిది పిచ్చయ్య,జొన్నలగడ్డ పుల్లారావు , గుండ్ల రాంబాబు పాల్గొన్నారు

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వేములకొండ కరెంటు రిపేర్ కోసం నిధులు కేటాయించిన ఎమ్మెల్యే.

- కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించిన గ్రామ సర్పంచి ఏర్పుల వెంకటేశం.



సి కే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జనవరి 28. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని వేములకొండ గ్రామంలో ఈరోజు గ్రామ సర్పంచ్ ఏర్పుల వెంకటేశం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో గతంలో కరెంటు వైరు షార్టు సర్క్యూటివ్ వలన కరెంటు హాస్పిటల్ కు రాక ఇబ్బందిగా ఏర్పడ్డది ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లిన నాయకులు ఈ విషయం తెలుసుకున్నా ఎమ్మెల్యే రిపేర్ కోసం పది లక్షల రూపాయలు నిధులు కేటాయించినారు..

ఈరోజు పనులు ప్రారంభించిన గ్రామ సర్పంచ్ ఏర్పుల వెంకటేశం ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పులిపాలుపుల
రాములు గౌడ్ ఎస్ కే రసూల్ గ్రామ నాయకులు ఉప సర్పంచ్ అంబటి సాయి కుమార్ గ్రామపంచాయతీ వార్డు నెంబర్లు అందరూ మరియు గ్రామ నాయకులు శ్రీను కాడిగళ్ళ నరసింహ జడీగే సత్తయ్య వైద్య సిబ్బంది డాక్టర్ వేణు మాధవి డాక్టర్ ఉమామహేశ్వరి ఆయుష్ మేడం అర్చన సూపర్వైజర్ అనురాధ సుదర్శన్ రమేష్ రేణుక సరిత అనిత పెల్లి కంప్యూటర్ స్వామి శ్రీకొండలరావు శ్రీరాజేశ్వరి మరియు వైద్య సిబ్బంది హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు. గ్రామ సర్పంచి మాట్లాడుతూ ఇంకా కావాల్సిన మౌలిక వసతులు ఎమ్మెల్యే ద్వారా ఏర్పాటు చేసుకుంటామని ఎమ్మెల్యే కి ధన్యవాదాలు తెలిపినారు.?

# సికే న్యూస్ దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరించిన డాక్టర్ కోట రాంబాబు



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కోట రాంబాబు సికే న్యూస్ దినపత్రిక క్యాలెండర్ మధిరలో ఆవిష్కరించారు .ఈ సందర్భంగా కోట రాంబాబు మాట్లాడుతూ నేటి ఆధునిక ప్రపంచంలో డిజిటల్ మీడియాలో సికే న్యూస్ దినపత్రిక నిలిచిందని పత్రిక రంగంలో సరికొత్త మార్పులకు సికే న్యూస్ పేపర్ చుట్టిందని అన్నారు. ప్రజలను చైతన్యవంతులను చేయడంలో పత్రికలు ముందు ఉన్నాయని ప్రజా సమస్య పరిష్కరించడంలో ప్రజలకు ప్రభుత్వానికి వారదిగా పని చేయాలని జర్నలిస్టులు బాధ్యత పనిచేసి సమాజానికి ఉపయోగపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలోసి కే న్యూస్ రిపోర్టర్ గుడిది పిచ్చయ్య,జొన్నలగడ్డ పుల్లారావు , గుండ్ల రాంబాబు పాల్గొన్నారు..

# వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలి : ప్రెస్ క్లబ్ ఏన్కూర్



- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఏన్కూర్ జర్నలిస్టుల విజ్ఞప్తి
- సవరణ జీవో103 జారీపై కృతజ్ఞతలు తెలిపిన అధ్యక్షుడు ధీరావత్ సందీప్ నాయక్

సికే న్యూస్ ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఏన్కూరు జనవరి 28 2026:మీడియా కార్డుల విషయంలో గతంలో తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటూ రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు జారీ చేస్తామని ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సవరణ జీవో నెం.103ను జారీ చేయడంపై రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ప్రెస్ క్లబ్ ఏన్కూర్ అధ్యక్షుడు ధీరావత్ సందీప్ నాయక్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

బుధవారం ఏన్కూర్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం సీరియస్‌గా పరిగణలోకి తీసుకుని సానుకూల నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని అన్నారు. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న అక్రెడిటేషన్ సమస్యలకు ఈ జీవో ఒక పరిష్కారంగా మారుతుందని అభిప్రాయపడ్డారు.

జిల్లాలు, మండలాలు, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు లభించకపోవడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురయ్యాయని గుర్తు చేశారు. అలాంటి పరిస్థితులకు చెక్ పెట్టే విధంగా ప్రభుత్వం జీవోలో మార్పులు చేయడం జర్నలిస్టులందరికీ ఊరటనిస్తుందని అన్నారు. జిల్లాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ ఆయా ఎడిషన్ సెంటర్లలోనే అక్రెడిటేషన్ కార్డులు జారీ చేయాలని, ఇందువల్ల పారదర్శకత పెరుగుతుందని తెలిపారు.

అదేవిధంగా జిల్లా అక్రెడిటేషన్ కమిటీల్లోనూ వర్కింగ్ జర్నలిస్టులకు తగిన స్థానం కల్పించాలని మంత్రి పొంగులేటికి విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల అభిప్రాయాలు నేరుగా కమిటీల్లో ప్రతిబింబించేలా ఈ విధానం ఉండాలని కోరారు. జర్నలిస్టుల సంక్షేమమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యంగా కొనసాగుతూ, భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ పథకాలు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ సమావేశంలో ప్రెస్ క్లబ్ ఏన్కూర్ ఉపాధ్యక్షులు శివకుమార్, ప్రధాన కార్యదర్శి గోపికృష్ణతో పాటు అశోక్ రెడ్డి, రమేష్, ఠాగూర్, రాము, నరసింహ, చంద్రశేఖర్ తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా ముందుకు సాగాలని సమావేశం నిర్ణయించింది.

# తెలంగాణ ప్రభుత్వం చర్చిలకు, అర్థిక సహాయం



తాసిల్దార్ శివప్రసాద్

జనవరి 28 (సీ కే న్యూస్) చేగుంట / చేగుంట మండల్ పొలంపల్లి గ్రామానికి చెందిన సీయోను మినిస్ట్రీస్ చర్చ్ కు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చర్చ్ అభివృద్ధి కొరకు చేగుంట సొసైటీ రిజిస్టర్ అయి ఉన్న ముడు చర్చ్ లకు బుధవారం నాడు చేగుంట స్థానిక తహసిల్దార్ శివప్రసాద్ ఎమ్మార్వో కార్యాలయంలో 30,000 రూపాయల చెక్కును పొలంపల్లి చర్చ్ సియోన్ మినిస్ట్రీ పాస్టర్ రాజశేఖర్, కొండి శ్రీనివాస్ కు అందజేశారు,ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ జై భరత్ రెడ్డి పాల్గొన్నారు,

# భద్రాచలం లో 50.4 కేజీల గంజాయి పట్టివేత.




- ఒరిస్సా నుంచి కేరళకు కారు లో గంజాయి తరలింపు..
- నిందితుల నుంచి రూ. 17 వేలు స్వాధీనం.

సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 28, ఒరిస్సా మల్కాన్గిరి జిల్లా నుంచి కేరళకు కారులో అక్రమంగా తరలిస్తున్నటువంటి గంజాయిని ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ సిబ్బంది పట్టుకున్నారు. 50.4 కేజీల గంజాయి తో పాటు రూపాయలు 17,000 నగదును కూడా స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కే.తిరుపతి ఆధ్వర్యం లో ఎస్సై సిహెచ్.శ్రీ హరి రావు మరియు సిబ్బంది కలిసి భద్రాచలం నుండి నెల్లిపాక రోడ్డు లో తనిఖీలు తనిఖీలు చేపట్టారు. భద్రాచలం ఇసుక రీచ్ సమీపం లో అనుమానాస్పదంగా కనిపించిన ఒక ఫ్లాట్ కారు ను ఆపి తనిఖీ చేయగా కారు లో కేజీల గంజాయి లభ్యమైంది.

తదుపరి విచారణ లో ఇట్టి గంజాయి ని తిరువనంతపురం (కేరళ)కి చెందిన ఏ 1) అక్షయ్ సురేష్ , ఏ 2) కుంజుమాన్ సురేంద్రన్ మినిమోల్ మరియు ఏ 3) అనంత కృష్ణన్ లు ఒడిశా రాష్టం లోని మల్కాన్ గిరి నుండి తిరువనంతపురం (కేరళ) కు తరలిస్తున్నట్లు నిందితులు అంగీకరించారు.. తదుపరి విచారణ నిమిత్తం ఇట్టి గంజాయిని , ఫ్లాట్ కార్ ను , ముగ్గురు ముద్దాయిలను , 4 సెల్ ఫోన్లను మరియు రూ. 17 వేల నగదును సీజ్ చేసి ( వీటి మొత్తం విలువ 28 లక్షల 70 వేల రూపాయలు) భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్ లో అప్పగించడమైనది.. ఈ తనిఖీల లో హెడ్ కానిస్టేబుల్ యం.ఏ.కరీం, కానిస్టేబుల్స్ సుధీర్, వెంకట్, హనుమంతరావు, వీరబాబు , ఉపేందర్ లు ఉన్నారు. గంజాయిని పట్టుకున్న టీం ను తెలంగాణ ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం, స్పెషల్ డ్రైవ్ లో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జి.జనార్ధన్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ జి.గణేష్ అభినందించారు.

ఏదైనా గంజాయి కి సంబంధించిన సమాచారం ఉంటే ఎక్సైజ్ టోల్ ఫ్రీ నెంబర్ 18004252523 కు సమాచారం అందించగలరని, మీ వివరాలు గోప్యం గా ఉంచబడతాయి అని ఈ ఎస్ తిరుపతి తెలియజేశారు .

# నగరంలో మురికి కాల్వల సమస్యలకు శాశ్వత పరిష్కారం...

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- 21వ డివిజన్ లో సిసి రోడ్లు, సైడ్ డ్రైన్ నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేసిన మంత్రి తుమ్మల



సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, జనవరి -29:ఖమ్మం నగరంలో మురికి కాల్వల సమస్యలకు శాశ్వత పరిష్కారం కొరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

బుధవారం 21 వ డివిజన్ లో రూ. 545.60 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఖమ్మం నగరంలో మురికి కాల్వల సమస్యలకు శాశ్వత పరిష్కారం అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణానికి రూ. 1250 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణ పనులకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించినట్లు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో కేంద్ర ప్రభుత్వ నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణం చేపడతామని మంత్రి తెలిపారు. ఖమ్మం నగరంలో తాగునీటి సమస్య లేకుండా మరో 250 కోట్లతో తాగునీటి పథకం పనులు చేపట్టినట్లు మంత్రి తెలిపారు.

నగరంలో అన్ని మౌళిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధ చర్యలు చెప్పట్టిందని అన్నారు. ఖమ్మం నగరం క్లీన్ అండ్ గ్రీన్ గా ఉండేలా పౌర సహకారంతో అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. నగరం పచ్చదనంతో, పరిశుభ్రంగా ఉండేలా ప్రతిఒక్కరు తమ వంతు బాధ్యత నెరవేర్చాలన్నారు.

ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కీ" శే" గట్టు ప్రసాద్ బాబు అంత్యక్రియలకు హాజరైనా

- తెలంగాణ తెలుగుదేశం పార్టీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు,పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు.
- టీడీపీ సీనియర్ నాయకులు
- టీటీడీ బోర్డు సభ్యులు నన్నూరి నర్సిరెడ్డి .



సీకే న్యూస్ జనవరి 28 బుధవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ప్రతినిధి కమలాకర్.

అనారోగ్యం తో స్వర్గస్తులైన కీ శే గట్టు ప్రసాద్ బాబు అంత్యక్రియలు ఈరోజు జరిగాయి.

స్టే.ఘనపూర్ నియోజకవర్గం లో గట్టు ప్రసాద్ బాబు స్వగృహం కు వచ్చి పార్థివ దేహానికి పూలమాల వేసి,పార్టీ కండువా కప్పి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా బక్కని నర్సింహులు,నన్నూరి నర్సిరెడ్డి మాట్లాడుతూ, గట్టు ప్రసాద్ బాబు పార్టీ కోసం ఎంతో నిబద్ధత తో పని చేశారు .అలాంటి గొప్ప నాయకున్ని ఈరోజు మనం కోల్పోవడం చాలా బాధాకరం.

మేము వరంగల్లో పార్టీ కార్యక్రమాలకు ఎప్పుడు వచ్చినా కూడా జప్రసాద్ బాబు పార్టీ మీటింగుల్లో చాలా చురుకుగా ఉండేవారు.అలాంటి వ్యక్తి మన మధ్య లేకపోవడం వ్యక్తిగతంగా మాకు అటు టీడీపీ పార్టీకి తీరని లోటుగాభావిస్తున్నాము.

అట్లనేగట్టు ప్రసాద్ బాబు ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నాము.

ఈ అంతిమ యాత్రలో పుట్ట రజినీకాంత్ స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్, బంటు వెంకటేశ్వర్లు జాతీయ క్రమశిక్షణ కమిటీ సభ్యులు, సామ భూపాల్ రెడ్డి గారు రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ, బండి పుల్లయ్య గారు రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ , శ్రీపతి సతీష్ బిసి సెల్ అధ్యక్షులు, పోలంపల్లి అశోక్ గారు ఎస్సీ సెల్ అధ్యక్షులు, వరంగల్ పార్లమెంట్ కన్వీనర్ అర్చన పెల్లి విద్యాసాగర్ రావు గారు, ముంజ వెంకట్రాజ్యం గౌడ్ , టి ఎన్ యు ఎస్ రాష్ట్ర అధ్యక్షులు, భువనగిరి పార్లమెంటు అధ్యక్షులు కృష్ణమాచారి , బాలకృష్ణ అభిమాన సంఘం కన్వీనర్ జిఎల్ శ్రీధర్ , వర్ధన్నపేట ఇంచార్జ్ సురేఖ , రాష్ట్ర నాయకులు బైరపాక ప్రభాకర్, నరేష్ నాయక్, జయశంకర్, మండల పార్టీ అధ్యక్షులు మాదిరెడ్డి ధర్మారెడ్డి, బుక్క రామచంద్రయ్య, ఆరూరి రాజు, మేకల రమేష్ యాదవ్, కాసర్ల ఏలియా, కలకోట రమేష్, కొట్టే దామోదర్ ఉపాధ్యక్షులు మాజీ, ఉమ్మడి వరంగల్ జిల్లా, జనగాం జిల్లా టీడీపీ నాయకులు,అన్ని మండలాల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజ్‌నగర్ కాలనీ సమగ్రాభివృద్ధికి కృషి-కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి

సికే న్యూస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ రంజిత్ :ఉప్పల్ డివిజన్‌లోని రాజ్‌నగర్ కాలనీ సమగ్రాభివృద్ధికి కృషి చేయనున్నట్టుగా కార్పొరేటర్ మందుముల.రజితాపరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు.రాజ్‌నగర్ కాలనీలో రూ.42 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి, ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా కాలనీవాసులు.రజితాపరమేశ్వర్ రెడ్డి దృష్టికి స్థానిక సమస్యలను తెచ్చారు. ముఖ్యంగా కాలనీలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందన్నారు. దీంతో పాటు వర్షం పడితే రోడ్లన్నీ కూడా వరదతో నిండిపోతున్నాయని కార్పొరేటర్‌కు వివరించారు. డ్రైనేజీ, వర్షపు నీటి సమస్య పరిష్కారానికి సకాలంలోనే పనులను చేపట్టనున్నట్టుగా హామీ ఇచ్చారు.కార్యక్రమంలో డిఈ వెన్నెల్ గౌడ్ ,ఏఈ రాజ్ కుమార్,హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారి.సత్యనారాయణ,దుబ్బ నర్సింహ రెడ్డి,కలూరి వేణు,అయోధ్య ,సల్లా ప్రభాకర్.రెడ్డి,జీవన్.రెడ్డి,డేవిడ్ ,కిషోర్ ,కేశవరావుగారు,పవన్,బాలు,నాగరాజు,రాజ్ కుమార్,చంద్రం ప్రశాంత్,చారి,శ్రీ బాలాజీ తదితరులు పాల్గొన్నారు



# 2026 భారత్ సమాచార్,, ఇంగ్లీష్ డైలీ క్యాలెండర్ ను ఆవిష్కరించిన బ్యాంక్ మేనేజర్ రాయల దివాకర్.

**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బస్వాపురం శాఖ గ్రామం సెంటర్ నుండి ఖమ్మం బస్వాపురం మెయిన్ రోడ్డు కి మార్చిన సందర్భంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ దయాకర్ 2026 క్యాలెండర్ ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాయల్ దివాకర్ మాట్లాడుతూ పత్రికలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు బ్యాంకుల ద్వారా ఇచ్చే విధానాల గురించి ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్తాయని, అదేవిధంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ను ప్రజలకు అందుబాటులో ఉండాలని బ్యాంకులను గ్రామాలకు తీసుకురావడం హర్షించదగ్గ విషయం అన్నారు.

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారధి గా పనిచేస్తున్నదని, ఇప్పటి సమాజానికి ఇంగ్లీష్ పేపర్ అవసరం ఎంతో ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వాలు ప్రకటించే పథకాలను యూనియన్ బ్యాంక్ ద్వారా ప్రజలు ఎంతో లాభం పొందుతున్నారని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో




ప్రెస్ మీడియా ఖమ్మం జిల్లా బ్యూరో గండారపు రామారావు,అస్టెంట్ మేనేజర్ దూడల శివకుమార్, బ్యాంకు సిబ్బంది బాలకృష్ణ, ఉదయ్, వెంకటా చారి, శంషుద్దీన్, బ్యాంకు మిత్రులు శైలజ, నజీమా, తదితరులు పాల్గొన్నారు.

# నిత్యజీవితములోని బోధనలో సమాచార భావ ప్రసార సాంకేతికతను జోడించండి- చైతన్యజైని

- జిల్లా విద్యాశాఖ అధికారి ఖమ్మం



**సికె న్యూస్ ప్రతినిధి :**పీఎం శ్రీ పాఠశాలల్లో పనిచేసే ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులకు ఐసిటి అంశాల పైన రెండు రోజుల శిక్షణా తరగతులు జిల్లా విద్యా శిక్షణ సంస్థ మరియు సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో ప్రారంభమైనాయి
ఈ కార్యక్రమానికి కోర్స్ డైరెక్టర్గా వ్యవహరిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైని, ముఖ్యఅతిథిగా హాజరై
శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి
మాట్లాడుతూ కంటెంట్, పెడగాజి, అసెస్మెంట్ మరియు కమ్యూనికేషన్ అంశాలలో కూడా ఐసిటి వినియోగాన్ని పెంచడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ తద్వారా మెరుగైన అభ్యసన ఫలితాలను సాధించవచ్చని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ రెండు రోజులలో గూగుల్ అంశాల పైన అనగా గూగుల్ ఫామ్స్, గూగుల్ షీట్లు, గూగుల్ డాక్యుమెంట్లు, గూగుల్ స్లైడ్ లను ఎలా రూపొందించాలి,
వాటిని ఎలా వినియోగించుకోవాలి,
వాటి అవసరం ఏమిటి,
వాటి ద్వారా పిల్లలకు మెరుగైన బోధన అభ్యసన ప్రక్రియలను ఏ విధంగా జరపవచ్చో తదితర అంశాల పైన ఇంటర్ ఆక్టివ్ గా వివరిస్తూ మరియు వచ్చిన ఉపాధ్యాయులతో అన్ని శిక్షణ అంశాలను సాధన చేయించడం జరుగుతుంది అని ఈ శిక్షణ చాలా ఉపయోగకరం- సరస్వతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కూసుమంచి, ఖమ్మం, కరోనా సమయంలో మరియు కరోనా అనంతరం జరిగిన మార్పుల నేపథ్యంలో విద్యాబోధనలో సాంకేతిక వినియోగం చాలా పెరిగింది. నిరంతరం పై అధికారుల నుండి గూగుల్ ఫార్మ్ షీట్లు, డాక్యుమెంట్లను పంపిస్తే వాటిని నింపడం వరకే చేస్తున్నాము కానీ వాటిని ఎలా తయారు చేసుకోవాలి? ఎలా వినియోగించుకోవాలి వాటి వలన మా విద్యార్థులకు ఏమి ఉపయోగం జరుగుతుందో ఈ శిక్షణ కార్యక్రమంలో స్పష్టంగా తెలుసుకున్నాం దీనివల్ల మా విద్యార్థులకు మేలు జరుగుతుంది.
మొత్తం ఖమ్మం జిల్లాలోని 28 పీఎంశ్రీ పాఠశాలల్లోని 508 ఉపాధ్యాయులకు రెండు విడుతలగా సాంకేతిక వినియోగము, ఐసిటి అంశాల పైన శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. పీఎం శ్రీ పాఠశాలలుగా ఎంపికైన ఉన్నత పాఠశాలలో సాంకేతిక వినియోగం విస్తృతంగా పెరిగింది .దీని నేపథ్యంలో ప్రతి పాఠశాలకు ఒక లాప్టాప్ ను మరియు ఉపాధ్యాయులకు ట్యాబ్ లను అందజేశారు. ఈ ట్యాబ్లను ఉపయోగిస్తూ, సాంకేతిక అంశాల పైన విద్యార్థులకు నాణ్యమైన బోధన ఏ విధంగా అందించవచ్చు అనేది ఈ శిక్షణలో తెలియజేయడం జరుగుతుందని
కోర్సు కోఆర్డినేటర్ గా ఉన్న జిల్లా ఎ ఎమ్ ఓ పెసర ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు

# వైరా ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన ఎస్. సారంగపాణి



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**వైరా ఏసీపీగా ఎస్. సారంగపాణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు.
రాష్ట్రంలో పలువురు డీఎస్పీల బదిలీల్లో భాగంగా వైరా ఏసీపీగా ఎస్. సారంగపాణిని నియమిస్తూ ఇటీవల డీజీపీ శివధర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో రిపోర్ట్ చేశారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి ...



- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెంచాలి
- ఎన్.సి.డి. సర్వే నిర్వహణపై వైద్య అధికారులు దృష్టి సారించాలి
- వైద్య,, ఆరోగ్యశాఖపై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్

**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, జనవరి -29:**ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్యశాఖ వివిధ విభాగాల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ పి.హెచ్.సి. లలో పని చేసే ప్రతి సిబ్బంది అటెండెన్స్ ను పర్యవేక్షించాలని, అనుమతిలేని సెలవులు, గైర్హాజరుపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఏఎన్సి రిజిస్ట్రేషన్ వంద శాతం జరగాలన్నారు. 4 సార్లు పరీక్షలు జరిగివుండాలని తెలిపారు. ప్రతి వైద్యాధికారి తన పరిధిలోని ఆశా కార్యకర్తలతో రెగ్యులర్ గా సమావేశాలు పెట్టుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రయివేటు ఆసుపత్రుల్లో ఆపరేషన్లు ఎక్కువగా జరుగుతున్నాయని, ప్రతి కేసును పరిశీలించి, అవసరంలేని ఆపరేషన్లు నిరోధించాలన్నారు. గర్భిణీ లకు చికిత్స అందించడంలో నిర్లక్ష్యం వహించిన ప్రైవేట్ ఆసుపత్రులపై కూడా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆశా కార్యకర్తలు రెగ్యులర్ గా తమ పరిధిలో ఇంటింటి సర్వే చేస్తూ గర్భిణి మహిళల వంద శాతం ఏ.ఎన్.సి. రిజిస్ట్రేషన్ పూర్తి అయ్యేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల దగ్గర ఉన్న వసతులు ప్రైవేటు ఆసుపత్రులలో లేవని దీనిపై అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలో వీలైనంత వరకు సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని, సి సెక్షన్ డెలివరీలను నివారించాలని అన్నారు. ప్రతి సెక్షన్ ఆపరేషన్ పై ఆడిట్ రిపోర్ట్ ఉండాలని అన్నారు.
ప్రతి పి.హెచ్.సి. పరిధిలో వంద శాతం పిల్లలకు టీకాలు వేయించాలని, వైద్య అధికారులు టీకాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతి ఆశా కార్యకర్త ఫాలో అప్ చేయాలని అన్నారు. ఎల్ఎంపి రిజిస్టర్స్ రాయాలని కలెక్టర్ అన్నారు. ప్రతి పి.హెచ్.సి. పరిధిలో ఎన్.సి.డి. సర్వే పూర్తి చేసి వివరాలు ఆన్ లైన్ లో నమోదు చేయాలని, వైద్య అధికారులు తమ పరిధిలో ఆశా కార్యకర్తలతో చర్చించి సమస్యకు పరిష్కారం చూపాలని అన్నారు. ఎన్.సి.డి. సర్వే నిర్వహణలో ఆశా కార్యకర్తలు, ఏ.ఎన్.ఎం, ఎం.ఎల్.హెచ్.పి. పాత్ర ఎంత ఉండాలో నిర్దేశించుకోవాలని అన్నారు. ఆరోగ్య మహిళకి వైద్యాధికారికి లక్ష్యాలు ఇచ్చి, వాటిని ఆన్లైన్ చేసి, మానిటరింగ్ చేయాలన్నారు.
టీబీ నిర్మూలనకు చిత్తశుద్ధితో కృషి చేయాలని, నిర్దేశించిన లక్ష్యం మేరకు అనుమానితులను గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. తెలంగాణ డయాగ్నొస్టిక్ హబ్ ద్వారా వైద్య పరీక్షల ఫలితాలు త్వరగా అందించేలా చూడాలని అన్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రానికి సంబంధించి ఎంత మంది ఓపి, ఎన్ని సాంపుల్ సేకరించింది, ఎన్ని రిపోర్టులు 24 గంటల్లో అందించింది, ఎన్ని తిరస్కరించింది వివరాల నివేదిక ప్రతినెలా సమర్పించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో పరీక్షలు జరిగినప్పుడు ప్రజలకు మనపై నమ్మకం పెరుగుతుందని అన్నారు. ప్రతి పి.హెచ్.సి.కి లక్ష్యాలు కేటాయించి వైద్య పరీక్షల శాంపిల్స్ సేకరించాలని అన్నారు.
ఆర్బిఎస్ కె టీమ్ వంద శాతం పిల్లల్ని స్క్రీనింగ్ చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు వెళ్లాలని, ప్రభుత్వ వసతి గృహాలు రెగ్యులర్ గా సందర్శించి, అవసరమైన పిల్లలకు వైద్య సేవలు అందించాలని అన్నారు. సికిల్ సెల్ లక్ష్యం పూర్తి చేయాలని, గుర్తించిన వారికి తగు చికిత్స అందించాలని తెలిపారు. ఎయిడ్స్ పట్ల ప్రజల్లో అవగాహన పెంచాలని తెలిపారు. మధిరలో క్రొత్త బ్లడ్ బ్యాంకు ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు.
కంటి వెలుగు కార్యక్రమంలో ఆపరేషన్ల అవసరం గుర్తించిన వారికి ఆపరేషన్లు చేపట్టాలని అన్నారు. దత్తత నియమాల ప్రకారం పొందేలా చూడాలన్నారు. మూడవ అమ్మాయి పుట్టినచోట వారిని ట్రాక్ చేయాలన్నారు. వేసవికాలంలో హీట్ వేవ్ దృష్ట్యా ఓఆర్ఎస్, ప్రథమ చికిత్స మందులు అన్ని ఆరోగ్య కేంద్రాల్లో తగినంత అందుబాటులో ఉంచాలన్నారు. ప్రజల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు.
ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. రామారావు, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. చందు నాయక్, డిప్యూటీ వైద్య ఆరోగ్య అధికారి డా. వేణు మనోహర్, పీవో లు డా. సుబ్బారావు, డా. బిందుశ్రీ, డా. ప్రవీణ, ప్రోగ్రామ్ అధికారులు, వైద్యాధికారులు, సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య





**సి కె న్యూస్ఆత్మకూర్ (యం) రిపోర్టర్ శైక్ ఆజీజ్**
ఆలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కోరటికల్ గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ శంకుస్థాపన మరియు గౌడ సంఘం భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఉప్పలపహాడ్ గ్రామంలో బీసీ కమ్యూనిటీ హాల్ అంగన్వాడీ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విద్యుత్ అందజేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా వుంటుందని అన్నారు గ్రామాలు అభివృద్ధి చేసే బాధ్యత నాది అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తా సంక్షేమ పథకాలు ప్రతీ ఒక్కరికి అందజేస్తా అని తెలిపారు ఈ కార్యక్రమం లో కోరటికల్ సర్పంచ్ కట్టేకోలా సుశీల హన్మంత్ ఉప్పలపహాడ్ సర్పంచ్ చిన్నం బీరప్ప మాజీ ప్రజాప్రతినిధులు అధికారులు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# టి రేపాక గ్రామంలో మహిళా సంఘం భవనం మరియు సీసీ రోడ్లు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బీర్ల





**సి కె న్యూస్ ఆత్మకూర్ యం రిపోర్టర్ శైక్ ఆజీజ్**
ఆత్మకూరు మండల పరిధిలో టి రేపాక గ్రామంలో మహిళా సంఘం భవనం మరియు సీసీ రోడ్లు శంకుస్థాపన చేసిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం భవనం స్థలం దాత బిఆర్ఎస్ జిల్లా నాయకులు మాజీ సర్పంచ్ గడ్డమీది రాణి రమేష్ గౌడ్ సర్పంచ్ బండ శీను ఉపసర్పంచ్ వార్డ్ మెంబర్లు మాజీ ప్రజాప్రతినిధులు అధికారులు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సౌకర్యార్థం ఉండేందుకు రోడ్డు కు ఇరువైపులా చెట్లను సొంత నిధులతో తొలగించి పరమతులు చేయించిన డిసిసి ఉపాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి.









**సి కే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జనవరి 28.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని అరూరు గ్రామం నుండి జంగారెడ్డిపల్లి గుడి వైపుకు వెళ్లే దారి కంపచెట్లతో రోడ్డు గుంతలతో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డును గమనించి ప్రజలకు సౌకర్యంగా ఉండే విధంగా సొంత నిధులతో జెసిబి ని ఏర్పాటు చేసి మరమ్మతులు చేయించిన డిసిసి ఉపాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి. రోడ్డును మరమ్మతులు చేయించినందుకు గ్రామస్తులు అనంతరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపినారు.

# పాఠశాలల్లో సామాజిక కార్యక్రమాలు అభినందనీయం

- కొలను హనుమంతా రెడ్డి
- విజ్ఞాన్ సుధా పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం




**సీకే న్యూస్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ రంజిత్ :**సామాజిక సేవా కార్యక్రమాలలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం ముందు ఉండడం అభినందనీయమని కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హనుమంత రెడ్డి అన్నారు. లైన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ ఆధ్వర్యంలో మల్లారెడ్డి ఆసుపత్రి సౌజన్యంతో చింతల్ లోని విజ్ఞాన్ సుదా హైస్కూల్లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఎందరికో ఉపయోగపడుతున్నాయన్నారు. మునుముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైసింగ్ తెలంగాణ పేరుతో భారతదేశంలోనే రాష్ట్రాన్ని నెంబర్ వన్ గా తీసుకెళ్తుంది అన్నారు. విద్యార్థులకు ఉత్తమైన భవిష్యత్తు ఇచ్చే విధంగా విద్యా విధానం రూపొందుతుందని తెలిపారు. ఈ సందర్భంగా సుమారు 500 మంది వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకున్నారు. సాధారణ, కంటి, దంత, గుండె, స్త్రీ సంబంధిత వైద్యులు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రామేశ్వర్ రెడ్డి, లయన్స్ క్లబ్ సికింద్రాబాద్ నార్త్ అధ్యక్షులు బిరు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి దయాకర్, విజ్ఞాన సుధా పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపల్ సుధా, లయన్స్ క్లబ్ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, వినోద్ జాదవ్, గడ్డమీది బాలరాజు, సి హెచ్ నరసింహులు గౌడ్, భాష, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రావణ్ కుమార్, లక్ష్మారెడ్డి, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘం భవనానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**సి కె న్యూస్ రిపోర్టర్ ఆత్మకూర్ యం శైక్ ఆజీజ్:** ఆత్మకూర్(ఎం ఆలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పోతిరెడ్డిపల్లి గ్రామంలో మహిళా సంఘం భవనానికి శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు ఈ కార్యక్రమం లో సర్పంచ్ నాగుల సత్యనారాయణ యాదవ్ ఉప సర్పంచ్ మెట్టు లలిత వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు ఎడమ మోహన్ రెడ్డి మాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు అధికారులు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తొలి రోజు నామినేషన్లు మూడు

- కొత్తగూడెం కార్పొరేషన్ హోరా హోరి
- మేయర్ పదవి పై పలు పార్టీల కన్ను




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 28,**
మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో కార్పొరేషన్ కి సంబంధించి మొదటి రోజు నామినేషన్లు 3 దాఖలు అయ్యాయి కొత్తగూడెం 2 పాల్వంచ1 దాఖలు కాగా బి ఆర్ ఎస్ 2 స్వాతంత్ర అభ్యర్థిగా ఒకటి నామినేషన్లు దాఖలు అయ్యాయని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత తెలిపారు.ఇంకా రెండు రోజుల పాటు నామినేషన్లు దాఖలు చేస్తారు. సి పి ఐ బిజెపి కాంగ్రెస్ బిఆర్ఎస్ బిఎస్ పి ఇండిపెండెంట్ లు సిద్ధంగా ఉన్నారు. 60 వార్డులు కలిగిన కలిగిన మున్సిపల్ కార్పొరేషన్ లో పాల్వంచ కొత్తగూడెం సుజాతనగర్ కలిసి అతిపెద్ద కార్పొరేషన్ గా మొట్టమొదటిసారిగా ఎన్నికలు నిర్వహిస్తున్నారు. దీనితో హోరాహోరీగా ఎన్నికలు జరగబోతున్నాయి. మేయర్ స్థానానికి పలువురు పోటీ పడుతున్నారు. మొట్టమొదటిసారిగా కార్పొరేషన్ ఎన్నికల్లో సత్తా చాటుకునేందుకు అభ్యర్థులు వ్యూహాలు పన్నుతున్నారు. దీనితో ఎన్నికలు రసవత్తంగా కొనసాగే అవకాశాలున్నాయి. మొట్టమొదటి మేయర్ స్థానానికై పలు పార్టీలు గురిపెట్టినాయి.

## 8వ డివిజన్ బిఆర్ఎస్ అభ్యర్థినిగా కాంపెల్లి సంధ్య పటేల్ నామినేషన్

- పార్టీ శ్రేణులతో కలిసి ఎన్నికల అధికారికి పత్రాల అందజేత
- అభివృద్ధి నినాదంతో ప్రజాక్షేత్రంలోకి.. బిఆర్ఎస్ ధీమా
- గెలుపే లక్ష్యంగా కదులుతున్నాం: జిల్లా నాయకుడు కాంపెల్లి కనకేష్ పటేల్



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ పాల్వంచ ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 28,**
కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నామినేషన్ల పర్వం తొలిరోజే 8వ డివిజన్ నుంచి బిఆర్ఎస్ పార్టీ తరపున కాంపెల్లి సంధ్య పటేల్ నామినేషన్ దాఖలు చేశారు. బుధవారం తన భర్త, బిఆర్ఎస్ జిల్లా నాయకుడు కాంపెల్లి కనకేష్ పటేల్ పార్టీ ముఖ్య శ్రేణులతో కలిసి ఆమె భారీ ర్యాలీగా తరలివచ్చారు. అనంతరం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. అభివృద్ధికి బాటలు వేస్తాం.ఈ సందర్భంగా బిఆర్ఎస్ జిల్లా నాయకుడు కాంపెల్లి కనకేష్ పటేల్ మాట్లాడుతూ పాల్వంచ కార్పొరేషన్ పరిధిలోని 25 డివిజన్లలో పార్టీ గెలుపు కోసం వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. 8వ డివిజన్ బాధ్యతను తాను పర్యవేక్షిస్తున్నానని, ఇక్కడ ప్రజల మద్దతు సంపూర్ణంగా ఉందన్నారు. అభ్యర్థిని సంధ్యా పటేల్ గెలుపు ద్వారా డివిజన్ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు.
ప్రజా సమస్యలే అజెండా అలాగే అభ్యర్థిని కాంపెల్లి సంధ్య పటేల్ మాట్లాడుతూ.. డివిజన్లోని ప్రతి గడపకూ చేరుకుని ప్రజా సమస్యలను తెలుసుకుంటున్నామని, ఎన్నికల తర్వాత మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, మహిళా ప్రతినిధులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంధ్యకు మద్దతు తెలిపారు.
కాంగ్రెస్ వైఫల్యాలపై పోరు గత వారం రోజులుగా డివిజన్ వ్యాప్తంగా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తున్నామని సంధ్యా పటేల్ పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ప్రజలను ఆరు గ్యారెంటీల పేరుతో మోసం చేసిందని, ఆ అబద్ధపు హామీలను ప్రజల్లో ఎండగడుతున్నామని ఆమె పేర్కొన్నారు. అసంపూర్తిగా ఉన్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలను ఎంపీలు, ఎమ్మెల్సీల నిధులతో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా మిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలు పారదర్శకంగా, శాంతియుతంగా నిర్వహించాలి.

**అదనపు కలెక్టర్ విద్యాచందన**




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 28,** జిల్లాలో మున్సిపల్ ఎన్నికలను పూర్తిగా పారదర్శకంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించడంలో జోనల్ అధికారులు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్లోని ఐడిఓసి మీటింగ్ హాల్లో బుధవారం మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్లు (ఎఫ్ ఎస్ టి) స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్లు ( ఎస్ ఎస్ టి), జోనల్ అధికారులు మరియు అకౌంటింగ్ టీమ్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన తెలిపారు.
ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి జోన్ పరిధిలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లపై జోనల్ అధికారులు నేరుగా పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల స్థితిగతులు, ఎన్నికల సిబ్బంది నియామకం, ఓటర్లకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కఠినంగా అమలు చేయాలని, ఎలాంటి ఉల్లంఘనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి తగిన చర్యలు చేపట్టి శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత జోనల్ అధికారులదేనని స్పష్టం చేశారు. పోలింగ్ రోజున ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, ఫిర్యాదులు అందిన వెంటనే తక్షణ స్పందన అందించాలని సూచించారు.
స్పష్టమైన ఆధారాలు (ఎవిడెన్స్) సేకరించిన అనంతరమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం ఏఐ ఆధారిత నకిలీ వీడియోలు విస్తృతంగా ప్రచారంలో ఉన్నందున అధికారులు అత్యంత అప్రమత్తతతో ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ఉల్లంఘనలకు సంబంధించి ఏ అంశానికి ఏ సెక్షన్ కింద కేసు నమోదు చేయాలో పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు.
ఈ శిక్షణ కార్యక్రమంలో ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి శ్రీరామ్ మాట్లాడుతూ, మద్యం స్వాధీనం (లిక్కర్ సీజ్యూర్) జరిగిన సందర్భాల్లో తప్పనిసరిగా వాటిని ఎక్సైజ్ శాఖకు అప్పగించాల్సి ఉంటుందని తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత ప్రదేశానికి చేరుకుని స్పాట్ వెరిఫికేషన్ నిర్వహించి, మొత్తం ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేయాలని సూచించారు. అవసరమైన సందర్భాల్లో ఎఫ్ ఎస్ టి బృందాలు ఎస్ ఎస్ టి బృందాలకు మార్గదర్శకత్వం అందించవచ్చని పేర్కొన్నారు. ఫిర్యాదు లేదా ఎఫ్ఐఆర్ను 24 గంటల్లోపు సంబంధిత న్యాయస్థానంలో సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. మహిళల హ్యాండ్బ్యాగ్ల తనిఖీని మహిళా అధికారులు మాత్రమే నిర్వహించాలని ఆదేశించారు. అదేవిధంగా,
ఈ కార్యక్రమంలో జోనల్ అధికారులు మరియు అకౌంటింగ్ టీమ్ సభ్యులు తమ తమ విధులు, బాధ్యతలు మరియు అనుసరించాల్సిన విధివిధానాలపై వివరించారు.
ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు అడిగిన సందేహాలకు మాస్టర్ ట్రైనర్ పూసపాటి సాయికృష్ణ స్పష్టమైన వివరణ ఇచ్చి నివృత్తి చేశారు.
ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సుధీర్, రాజశేఖర్, ఎంపీడీవోలు శ్రీనివాస్, సునీల్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## "వృక్షమిత్ర" డా: గోల్ల భూపతిరావుకు లైన్స్ క్లబ్ ఘన సన్మానం.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,( సాయి కౌశిక్),జనవరి 28,** ఉషోదయ ఫౌండేషన్ తిరుపతి వారు భద్రాద్రి లో సాంస్కృతిక సంగీత జానపద గీతలను ఉభయ రాష్ట్రాలనుండి పిలిపించి కమ్మవారి సత్రం లో కార్యక్రమం నిర్వహించచారు . ఈ సందర్భంగా ప్రముఖ పర్యావరణ ప్రేమికుడు హరితోత్సవ రాష్ట్ర ప్రభుత్వ అవార్డు గ్రహీత లయన్ డా. గోళ్ళ భూపతి రావు కు """వృక్ష మిత్ర """ అవార్డ్ ను ప్రదానం చేయడం జరిగినది. ఈ రోజు లయన్స్ క్లబ్ భద్రాచలం ఎవ సభ్యులు వృక్ష మిత్ర అవార్డ్ గ్రహీత డా. గోళ్ళ భూపతి రావు ను చినజీయర్ మట్టం లోజరిగిన కార్యక్రమంలో ఘ నంగా సన్మానించారు. ఈ సందర్భంగా గోళ్ల భూపతి రావు మాట్లాడుతూ భవిష్యత్తు లో పర్యావరణ కార్యక్రమాలు ఇంకా నిర్వహిస్తానని భద్రాద్రి ని పచ్చని భద్రాద్రి గా తీర్చి దిద్దు తానని తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్ క్లబ్ అధ్యక్షులు, కమల కుమారి, శిద్దారెడ్డి, గ్రీన్ భద్రాద్రి అధ్యక్షులు లలిత. లయన్ యేగి సూర్యనారాయణ, లయన్ రామలింగేశ్వర రావు, లయన్ నరసింహ చారి లయన్ శ్రీనివాసరాజు లయ న్ వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

## "వేగం కాదు ప్రాణం ముఖ్యం తస్మాత్ జాగ్రత్త"




- సంగం వెంకట పుల్లయ్య...
- మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్,
- ఆర్టిఏ భద్రాచలం యూనిట్ కార్యాలయం...

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ భద్రాచలం ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 28,** జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఈ రోజు బుధవారం నాడు రవాణా శాఖ భద్రాచలం యూనిట్ కార్యాలయంలో వివిధ వాహనాల డ్రైవర్లకు, వాహనదారులకు, లెర్నింగ్ లైసెన్స్ మరియు డ్రైవింగ్ లైసెన్స్ల కోసం కార్యాలయానికి వచ్చిన దరఖాస్తుదారులకు రోడ్డు భద్రతపై అవగాహన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ సంగం వెంకట పుల్లయ్య మాట్లాడుతూ, చిన్న నిర్లక్ష్యం మరియు అతి వేగం కారణంగా పెద్ద ప్రమాదాలు జరిగి అనేక మంది విలువైన ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల వేగం కన్నా ప్రాణమే అత్యంత ముఖ్యమని పేర్కొంటూ, "వేగం కాదు ప్రాణం ముఖ్యం, తస్మాత్ జాగ్రత్త" అనే నినాదాన్ని ప్రతి డ్రైవర్ తన జీవితంలో తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి రోడ్డు వినియోగదారు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రత్యేకంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించే వారు సీటుబెల్ట్ వినియోగాన్ని తప్పనిసరి అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. సెల్ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, నిద్ర మత్తులో వాహనం నడపడం, అధిక వేగం, తప్పు ఓవర్టేకింగ్ వంటి చర్యలే రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలని స్పష్టంగా తెలిపారు. పాదచారులు కూడా రోడ్డు దాటేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ నియమాలను గౌరవించి పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు. రోడ్డు భద్రత అనేది ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. అలాగే రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే బాధితులను ఒక గంట (గోల్డెన్ అవర్)లోపు సమీప ఆసుపత్రికి తీసుకెళ్లడం లేదా 112 నంబర్కు ఫోన్ చేసి అంబులెన్స్ ఏర్పాటు చేయడం ద్వారా సంవత్సరానికి సుమారు 50,000 మంది వరకు ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. ప్రమాద బాధితులకు సహాయం చేసిన వారికి పోలీసుల నుంచిగానీ, ఇతరుల నుంచిగానీ ఎలాంటి ఇబ్బందులు ఉండవని, గుడ్ సమారిటన్ చట్టం పూర్తి రక్షణ కల్పిస్తుందని స్పష్టం చేశారు.
ఈ అవగాహన కార్యక్రమంలో రాజశేఖర్ రెడ్డి ఏఎంవీఐ, శివయ్య కానిస్టేబుల్, భీముడు తదితర సిబ్బంది, వాహనదారులు, డ్రైవర్లు మరియు ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా గూడుపమ్మ ఆలయ ప్రధమ వార్షికోత్సవం



**సీ కే న్యూస్ :** మండలంలోని రేబాక గ్రామ దేవత గూడుపమ్మ తల్లి ఆలయ ప్రధమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. 226 ఏళ్ల చరిత్ర గల ఈ ఆలయాన్ని విస్తరిస్తూ నూతనంగా నిర్మించారు. గత ఏడాది ఆలయాన్ని పునఃప్రారంభించారు. మాఘమాసం శుక్లపక్షం దశమి సందర్భంగా బుధవారం ఆలయ ప్రధమ వార్షికోత్సవం జరిగింది. ఆలయ ధర్మకర్త గొట్టుముక్కల శ్రీహరిరాజు ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. పలువురు మహిళలు అమ్మవారికి భక్తి శ్రద్దలతో సారె సమర్పించారు. స్థానికులతో పాటు అనేక ప్రాంతాల నుంచి భక్తులు ఆ లయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. వెండికిరీటం, పుష్పాలంకరణలో ఆలయంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ప్రకృతి వనాల మధ్య వున్న గూడుపమ్మ ఆలయం పుష్పమాలల అలంకరణతో మరింత కళకళ లాడింది. మధ్యాహ్నం శ్రీప్రకాష్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తుల తాకిడితో ఆలయం రద్దీగా కన్పించింది. ఆలయం వద్ద బాలికలు, మహిళల కోలాట ప్రదర్శనలు విశేషంగా అలరించాయి. కోలాట గురువులను ఆలయ ధర్మకర్త శ్రీహరిరాజు ఘనంగా సత్కరించారు.సీఐ మురళి పర్యవేక్షణలో ఎస్ఐలు సన్నిబాబు, సాహిబా అంజుమ్ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పలువురు రాజకీయ ప్రముఖులు అమ్మవారి దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## శ్రీ శ్రీ ఆంజనేయస్వామి వార్షికోత్సవ నికి.

**మంత్రిని, ఎమ్మెల్యేను ఆహ్వానించిన జిల్లా కాంగ్రెస్ నాయకులు.**




**సీ కే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జనవరి 28.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పరిధిలోని అరూరు గ్రామపంచాయతీ మధిరలోని అప్పారెడ్డిపల్లి గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి వార్షికోత్సవలకు రావలసినదిగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని,ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ని,ఆహ్వాన పత్రిక ఇవ్వడం జరిగింది
కీర్తిశేషులు, తుమ్మల నరసయ్య సేవా సమితి నూతన అధ్యక్షునిగా ఎన్నికైన ఆవుల సత్యనారాయణ మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యేను కలవడం జరిగింది.
ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిట్టె డి జనార్దన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు బండారు నరసింహారెడ్డి ,తుమ్మల శ్రీనివాస్,తుమ్మల కర్ణాకర్ రెడ్డి, తుమ్మల నరసింహారెడ్డి ( రాజు) వలిగొండ మండల కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ మండల అధ్యక్షులు చిలకమర్రి కనకాచారి, మాజీ సర్పంచి పోలేపాక చెమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు ,

## శ్రీ హరి హర త్రిశక్తి క్షేత్రం 12వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆరవ రోజు చండీ పారాయణ.



**సి కే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జనవరి 28.** శ్రీ హరిహర త్రిశక్తి క్షేత్రం 12 వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా 6వ రోజు న చండీ పారాయణ, చండీ ఆవరణార్చన, చండీ హోమం(నవ చండీ), ఆంజనేయ అభిషేకం, మన్యుసూక్త సంపుటి పారాయణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. దేవాలయ నిర్వహకులు భక్తులందరికీ అన్నసంతర్పణ చేశారు.
సాయంత్రం 5.30 నిమిషాలకు శ్రీ వైభవ్ కుమార్ గారిచే కథక్ నృత్యసేవ కార్యక్రమం నిర్వహించబడినది.

# నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.:** గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు చింతకాని మండల పరిధిలో తిరుమలాపురం గ్రామంలోని , గ్రామంలోని విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు , ఇంటి పరిసరాలలో చెట్లు నరికినప్పుడు వర్షాలు, ఈదురుగాలుల సమయంలో చెట్లు విరిగిపడటం వల్ల విద్యుత్ తీగలు తెగిపడి, విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పాటు తీవ్రమైన ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది, గ్రామ సర్పంచ్ ముందు జాగ్రత్త వహించి, కరెంట్ షాక్‌ల నుండి సురక్షితంగా ఉండటానికి ఈ సమస్యను పరిష్కరించడానికి విద్యుత్ అధికారులతో మాట్లాడి తక్షణమే పనులు చేపట్టి విద్యుత్ స్తంభానికి సింగల్ ఫేస్ ఏబి ఏర్పాటు చేయడం జరిగినది. దీనివల్ల కొంతమేరకు ప్రమాదాల నుండి ఈ స్తంభం దగ్గర గ్రామంలోని సింగిల్ ఫేస్ కరెంట్ ను బంద్ చేసుకునే విధంగా ఏర్పాటు చేశారు విశేష సేవలందించిన గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు తిరుమలాపురం గ్రామ ప్రజలు అభినందించారు

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆశీస్సులతో ఖమ్మం జిల్లా పార్లమెంటు సభ్యులు శ్రీ రామసహాయం రఘురాం రెడ్డి సిఫార్సు మేరకు ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన శ్రీ గుండెబోయిన పెద్ద నాగేంద్ర వైఫ్ ఆఫ్ వెంకటేశ్వర్లు కి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి 60000 రూపాయల చెక్కును శ్రీనన్న రాష్ట్ర అధ్యక్షులు శ్రీ గుడిపూడి రజినీకాంత్ బాధితురాలు ఇంటి వద్దకు వెళ్లి అందజేస్తున్న దృశ్యం ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు

# ఉపాధి పనులు పరిశీలన.

- గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని మండల పరిధిలో తిరుమలాపురం గ్రామంలోనిమహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను క్షేత్ర స్థాయి లో గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు పరిశీలించారు ఈ తరుణంలో పనిచేస్తున్న కూలీలతో మాట్లాడుతూ.. దినసరి వేతనం రోజుకు 360 చెల్లించాలని మరియు ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ.. మేటును మడిపల్లి రామకృష్ణను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చాపల మడుగు వీరబాబు మరియు ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు

## హరిత గ్రామ లక్ష్యంతో
## పాతర్లపాడులో నూతన నర్సరీ ప్రారంభం....



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని : గ్రామాన్ని పరిశుభ్రంగా, హరిత గ్రామంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పాతర్లపాడు గ్రామపంచాయతీ పల్లె ప్రకృతి వనంలో నూతనంగా ఏర్పాటు చేసిన నర్సరీని ఉప సర్పంచ్ దారెల్లి సురేష్ శుభారంభం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామంలో పచ్చదనం పెంపొందించడమే ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. నర్సరీ ద్వారా పూల మొక్కలు, ఔషధ మొక్కలు, నీడనిచ్చే మొక్కలను పెంచి గ్రామంలోని ఖాళీ స్థలాలు, రహదారుల ఇరువైపులా, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద నాటనున్నట్లు పేర్కొన్నారు. ఈ నర్సరీ గ్రామ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కూడా సహాయపడుతుందని, స్వచ్ఛ గ్రామహరిత గ్రామ లక్ష్య సాధనలో కీలకంగా నిలుస్తుందని అన్నారు. ప్రతి ఇంటి ముందు కనీసం ఒక మొక్క నాటాలని గ్రామస్తులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ లో చేరిన బీఆర్ఎస్ పెబ్బేరు మున్సిపాలిటీ నాయకులు



**పెబ్బేరు జనవరి28 (సి కే న్యూస్)** పెబ్బేరు మున్సిపాలిటీకి చెందిన మాజీ ఎంపిటిసి, మాజీ కోఆప్షన్, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్, మాజీ వార్డు సభ్యుడు అయిన ఐజాక్ తో పాటు బీఆర్ఎస్ ముఖ్య నాయకులు ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ గంధం వెంకటయ్య, నరేందర్ లు బుధవారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి,డీసీసీ అధ్యక్షులు శివసేన రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీకి అవసరం ఉన్న సమయంలో మీరు రావడం అభినందనీయమని రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించేందుకు మీరు మనస్ఫూర్తిగా కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ హయంలో పదవుల్లో ఉన్నామే తప్ప ఎలాంటి గౌరవ మర్యాదలు ఉండేవి కావని నేడు కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనలో ప్రభుత్వ పథకాలు ప్రతి నిరుపేద కందుతున్నాయని ఆకర్షితులమై నేడు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్టు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పెబ్బేరు మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు,మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధికి తగిన నిధులు ఇవ్వండి.







- దేవాదాయ శాఖ ద్వారా పురాతన ఆలయాలు పునరుద్ధరణ.
- ధూప, దీప, నైవేద్యాల కోసం నిధులు మంజూరు చేయాలని కోరిన మాజీ మంత్రి.
- ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు మంజూరు చేయండి.
- నియోజవర్గంలో అదనపు విద్యుత్ సబ్ స్టేషన్లు, ట్రాన్స్ ఫార్మర్లు మంజూరుకు వినతి.

**పుట్టపర్తి, సి కే న్యూస్ జనవరి 28:** సత్యసాయి జిల్లా లోని పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇచ్చి ఆదుకోవాలని నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పలువురు మంత్రులను కోరారు. విజయవాడ లోని అమరావతి రాజధాని సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి సత్యసాయి జిల్లా ఇన్చార్జి మంత్రి అనగానీ సత్యప్రసాద్, రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, విద్యుత్, దేవాదాయ సాంఘిక, మైనార్టీ శాఖ మంత్రులు గొట్టి పాటి రవికుమార్, ఆనం రామనారాయణ రెడ్డి, డోలా బాల వీరాంజనేయులు, ఎండి ఫారుక్ తో పాటు పలువురు మంత్రులు వివిధ శాఖల ఉన్నతాధికారులను కలిసారు. బుధవారం నియోజకవర్గ అభివృద్ధికి తగిన నిధులు ఇచ్చి ఆదుకోవాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సూచన మేరకు, నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని పుట్టపర్తి ఎమ్మెల్యే లేఖను మంత్రులకు అందజేశారు. పుట్టపర్తి నియోజకవర్గంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన 193 చెరువులతో పాటు రెండు రిజర్వాయర్లను హంద్రీనీవా కాలువ ద్వారా చెరువులను నింపి ఆయకట్టుకు నీరు అందించే కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ మేరకు త్వరగా పనులు పూర్తయ్యేలా భూసేకరణ చేపట్టి, రాయల కాలం నాటి చెరువులను పునరుద్ధరించి వాటిని పటిష్టం చేయాలని జిల్లా ఇన్చార్జ్ మంత్రి రెవిన్యూ శాఖ మంత్రి అనగానీ సత్యప్రసాద్, ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ను ప్రత్యేకంగా కోరారు. అదేవిధంగా చెక్ డాములను నిర్మించి భూగర్భ జలాల పెంపుకు చర్యలు తీసుకోవాలని కోరారు.
నియోజవర్గం లోని దేవాలయాల పునర్నిర్మాణానికి దేవాదాయ శాఖ నిధులు మంజూరు చెయాలని మంత్రి ఆనంను కోరిన మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి. పుట్టపర్తి నియోజకవర్గం లోని పురాతన మైన ఆలయాలను పునరుద్ధరన, పునర్నిర్మాణం, ధూప దీప నైవేద్యాల కోసం పూజారులకు నెలసరి వేతనాలు తగిన నిధులు మంజూరు చేసి, 10 వ ..14 వ శతాబ్దం నాటి లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ శాసనాలను, అన్యాక్రాంత మైన భూములను కాపాడాలని కోరారు. నియోజకవర్గంలో దేవాలయాల పునర్నిర్మాణానికి దేవాదాయ శాఖ ద్వారా లేదా టీటీడీ ద్వారా తగిన నిధులు మంజూరు చేయాలని ఆ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ని మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రత్యేకంగా కోరారు. అదనంగా విద్యుత్ సబ్ స్టేషన్లు, వ్యవసాయ విద్యుత్ పరికరాలు మంజూరు చేయండి. నియోజకవర్గంలో రైతులు ఎక్కువగా ఉన్నారని నీరు పుష్కలంగా ఉండడం వల్ల అధిక పంటలు సాగు చేయడం వల్ల విద్యుత్ తీవ్రత ఎక్కువగా ఉందని దీనికి అదనపు సబ్ స్టేషన్ లతోపాటు వ్యవసాయ విద్యుత్ పరి కరాలు ట్రాన్స్ఫార్మర్లు వాటి పరికరాలు మంజూరు చేసి రైతులను ఆదుకోవాలని ఆ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ని మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రత్యేకంగా కోరారు. అదేవిధంగా నిర్మాణం పూర్తి అయిన సబ్ స్టేషన్లలో సిబ్బందిని నియమించి నాణ్యమైన విద్యుత్తును అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఖాళీగా ఉన్న సిబ్బందిని తక్షణం నియమించేలా చూడాలని ప్రత్యేకంగా కోరారు.
ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి సబ్ ప్లాన్ నిధులు మంజూరు చేయండి.
నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన గ్రామాలు, కాలనీలు ఎక్కువగా ఉన్నాయని, అభివృద్ధిలో చాలా వెనకబడి ఉన్నాయని అందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ ద్వారా తగిన నిధులు ఇచ్చి ఈ గ్రామాలను అభివృద్ధి చేయాలని మంత్రి డోల బాల వీరాంజనేయులు మాజీమంత్రి పల్లె రఘునాథ్ కోరారు. నియోజకవర్గం లోని మైనార్టీల సంక్షేమానికి మసీదుల మరమ్మత్తులు స్మశాన వాటికల నిర్మాణానికి మైనార్టీ శాఖ ద్వారా నిధులు మంజూరు చేయాలని ఆ శాఖ మంత్రి ఎండి ఫారుక్ ను మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రత్యేకంగా కోరారు. పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధికి తప్పకుండా తగిన నిధులు ఇచ్చి సహాయ సహకారాలు అందిస్తామని మంత్రులు హామీ ఇచ్చారు. సత్య సాయి బాబా శతజయంతోత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించారని ఏపీ లోని పుట్టపర్తి ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పే విధంగా కృషి చెసిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డినీ, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి నీ పలువురు మంత్రులు ప్రత్యేకంగా అభినందించారు.

# ప్రభుత్వ భవనాల నిర్మాణాలు, అభివృద్ధి పనుల్లో అవకతవకలకు తావు లేదు






**దెందులూరు, సి కే న్యూస్ జనవరి 28:** ప్రభుత్వ భవనాల నిర్మాణాలు, అభివృద్ధి పనుల్లో ఎటువంటి అవకతవకలకు, నిర్లక్ష్యానికి తావు లేకుండా, పూర్తి నిజాయితీగా, పారదర్శకంగా గుత్తేదారు సంస్థలు నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేయాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు.
ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా పెదవేగి మండలం జానంపేట గ్రామంలో బుధవారం ఉదయం జరిగిన ఆయుర్వేద ఆసుపత్రి భవన నిర్మాణ పనులు శంకుస్థాపన కార్యక్రమంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జానంపేట గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే చింతమనేని కి స్థానిక కూటమి నాయకులు, వైద్యశాఖ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్చాలను అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానిక ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా చింతమనేని మాట్లాడుతూ కేంద్ర రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ఎన్డిఏ ప్రభుత్వం ఆధ్వర్యంలో గ్రామీణ స్థాయిలో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తు పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా జానంపేట గ్రామంలో కేంద్రం 80%, రాష్ట్రం 20% బడ్జెట్ విధానంలో మొత్తం రూ.30 లక్షల రూపాయల నిధులతో ఆయుర్వేద ఆసుపత్రి నిర్మాణాన్ని చేపట్టామని, త్వరితగతిన ఈ హాస్పిటల్ నిర్మాణాన్ని కూడా పూర్తి చేసి ప్రజలకు అందుబాటు లోకి తీసుకురావడానికి కృషి చేస్తామని తెలిపారు. అదే సమయంలో నిర్మాణ పనుల వ్యవహారంలో గుత్తేదారు సంస్థలు పూర్తి నిబద్ధతతో నిర్మాణ పనులు నిర్వహించాలని, ఎటువంటి అలసత్వానికి తావు లేకుండా నాణ్యమైన నిర్మాణాలు చేపట్టాలని ఈ అంశంలో స్థానిక కూటమి నాయకులు, సంబంధిత అధికారులు కూడా ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తూ ఉండాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు బొప్పన సుధ, మండల రెవెన్యూ అధికారి భ్రమరాంబ సహా వైద్యశాఖ అధికారులు, సిబ్బంది, స్థానిక కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# కడుపు నొప్పి వస్తున్నా లైట్ తీసుకుంటున్నారా!



కడుపు నొప్పి రావడం సహజం. ప్రతి ఒక్కరూ ఏదో ఒక సమస్యల వలన కడుపు నొప్పి వంటి ఇబ్బందులను ఎదుర్కుంటారు. అయితే కొంత మందికి మాత్రం ఎలాంటి సమస్యలు లేకున్నా పదే పదే కడుపు నొప్పి వస్తుంటుంది. దీంతో ఇదేదో నార్మల్ అనుకొని దానిని లైట్ తీసుకుంటారు. కానీ ఇది చాలా ప్రమాదకరం అంటున్నారు ఆరోగ్య నిపుణులు. కడుపు నొప్పి రాగానే కొంత మంది ఇది గ్యాస్ సమస్య అనుకుంటారు. ఇంకొంత మంది మాత్రం తీసుకున్న ఆహారం జీర్ణం అవ్వడం లేదు అందుకే ఈ సమస్యనేమో అనుకుంటారు. కానీ పిత్తాశయంలో రాళ్లు ( గాల్ బ్లాడర్ స్టోన్స్) ఉన్న సమయంలో కూడా పదే పదే కడుపు నొప్పి వస్తుందని చెబుతున్నారు ఆరోగ్య నిపుణు? గాల్ బ్లాడర్ స్టోన్స్ వచ్చినప్పుడు, ప్రాథమిక దశలో కడుపు నొప్పి అనేది పదే పదే వస్తుందంట. అయితే ఇలా పదే పదే వస్తూ ఉన్నప్పుడు తప్పకుండా వైద్యుడిని సంప్రదించాలని చెబుతున్నారు వైద్యులు. ఎక్కువగా ఈ నొప్పి అనేది కడుపుకు కుడి వైపున మొదలై, ఓ ఐదు నిమిషాల వరకు నొప్పి అలానే ఉంటుంది. అంతే కాకుండా ఈ నొప్పి కుడి భుజం, వీపై వైపుకు కూడా పాకుతుందంట. గాల్ బ్లాడర్ స్టోన్స్ లక్షణాల్లోకి వెళ్లితే.. గాల్ బ్లాడర్‌లో స్టోన్స్ ఉన్నప్పుడు కుడివైపు పై భాగంలో తీవ్ర మైన నొప్పి, వాంతులు , వికారం, విరేచనాలు, కడుపు ఉబ్బరం, పసుపు రంగులోకి కళ్లు మారడం, వెన్ను నొప్పి , జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తాయంట. అయితే ఈ గాల్ బ్లాడర్ స్టోన్స్ రావడానికి ముఖ్య కారణం తీసుకుంటన్న ఆహారం, జీవనశైలి అంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఆహారంలో పీచు పదార్థం తక్కువగా ఉండటం, ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోకపోవడం వలన ఇలాంటి సమస్య ఏర్పడుతుందంట. అందుకే ఆరోగ్యం విషయంలో తప్పకుండా జాగ్రత్తలు తీసుకోవాలంట. ముఖ్యంగా పిల్లల నుంచి పెద్ద వారి వరకు ఎవ్వరైనా సరే పదే పదే కడుపు నొప్పి వంటి సమస్యలు ఎదురు అయినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు. నోట్ పై సమాచారం ఇంటర్నెట్ ఆధారంగా మాత్రమే ఇవ్వడం జరిగింది. టీవీ9 తెలుగు దీనిని ధృవీకరించలేదు.

# ఫాస్ట్‌గా బరువు తగ్గాలనుకుంటున్నారా?



బరువు తగ్గడం కేవలం తక్కువ తినడం కాదు, సరైన ఆహారం తీసుకోవడం. ఊబకాయం తగ్గాలంటే జీవక్రియను వేగవంతం చేసే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పాటించాలి. నిమ్మ, తేనెతో గోరువెచ్చని నీటితో రోజు ప్రారంభించండి. ఇడ్లీ, ఉప్మా, మొలకలు వంటి పోషక అల్పాహారం తినండి. భోజనంలో ఆకుకూరలు, తక్కువ అన్నం, సలాడ్ చేర్చండి. సాయంత్రం నట్స్, పండ్లు తీసుకోండి. రాత్రి తేలికపాటి భోజనం, వ్యాయామం, నీరు, నిద్ర బరువు తగ్గిస్తాయి. జంక్ ఫుడ్ మానండి. బరువు తగ్గడం అంటే తక్కువ తినడం మాత్రమే కాదు, సరైన ఆహారం తీసుకోవడం కూడా. నేటి జీవనశైలిలో సరైన పోషకాలు లేని ఆహారం కారణంగా చాలా మంది ఊబకాయంతో బాధపడుతున్నారు. సరైన పద్ధతిలో, సరైన ఆహారపు అలవాట్లను పాటిస్తూ ఉంటే..మీరు సులభంగా బరువు తగ్గవచ్చు. ఒక గ్లాసు గోరువెచ్చని నీటితో మీ రోజును ప్రారంభించండి. దానికి కొంచెం నిమ్మరసం, తేనె యాడ్ చేసుకోండి. దీని వల్ల మీ జీవక్రియ వేగవంతం అవుతుంది. ఇది శరీరం నుండి విషాన్ని బయటకు పంపి మీ చర్మాన్ని మెరుగుపరుస్తుంది. కాఫీ, టీలకు బదులుగా గ్రీన్ టీ తాగడం మంచిది. మార్నింగ్ బ్రేక్‌ఫాస్ట్ మంచి పోషకాలతో నిండి ఉండాలి. వేయించిన పూరీలు, వడలకు బదులుగా ఇడ్లీ, ఉప్మా లేదా ఓట్స్‌ను తీసుకోండి. మొలకెత్తిన ధాన్యాలు శరీరానికి అవసరమైన ప్రోటీన్‌లను అందిస్తాయి. బ్రేక్‌ఫాస్ట్ స్కిప్ చేయటం వల్ల మధ్యాహ్నం ఆకలిగా ఉంటుంది. కాబట్టి ఇది చాలా ముఖ్యం. మీ భోజనంలో తెల్ల బియ్యం మొత్తాన్ని తగ్గించి, ఆకుకూరలు, కూరగాయలకు ప్రాధాన్యత ఇవ్వండి. పాలిష్ చేయని బియ్యం, జొన్న రొట్టెలు తినడం మంచిది. భోజనానికి ముందు గ్రీన్ బఠానీలు, క్యారెట్లు, కీర వంటి వాటితో సలాడ్ తినడం వల్ల కడుపు నిండినట్లు అనిపిస్తుంది. మీరు తక్కువ తింటారు. క్రమం తప్పకుండా పెరుగు లేదా మజ్జిగ తీసుకోవటం వల్ల జీర్ణక్రియకు సహాయపడుతుంది.సాయంత్రం ఆకలిగా అనిపించినప్పుడు చిప్స్, బిస్కెట్లు తినడం మానుకోండి. బదులుగా, కొన్ని బాదం, వాల్‌నట్స్ లేదా ఒక పండు ముక్క తినండి. ఇది రాత్రి భోజనం వరకు మీ ఆకలిని అదుపులో ఉంచుతుంది. బరువు తగ్గాలనుకునే వారు వీలైనంత త్వరగా రాత్రి భోజనం ముగించాలి. రాత్రి 8 గంటల లోపు రాత్రి భోజనం చేయడం ముఖ్యం. రాత్రి తేలికపాటి భోజనం తినండి. మొక్కజొన్న గంజి లేదా సూప్ ఉత్తమ ఎంపికలు. రాత్రి భోజనం చేసిన వెంటనే పడుకునే బదులు, కాసేపు నడవడం అలవాటు చేసుకోండి. ప్రోటీన్ సమృద్ధిగా ఉండే ఆహారపదార్థాలు తీసుకోవడం వలన కండరాలు బలంగా ఉంటాయి, జీవక్రియ మెరుగవుతుంది. గుడ్లు, పప్పులు,టోఫు, చేపలు, చికెన్, పనీర్, యోగర్ట్ వంటి ఫుడ్ తీసుకోవాలి. ప్రోటీన్ పుష్కలంగా ఉండే ఈ ఫుడ్, శరీర బరువు తగ్గేందుకు దోహదం చేస్తుంది. ముఖ్యంగా బరువు తగ్గాలనుకునే వారు వీలైనంత త్వరగా రాత్రి భోజనం ముగించాలి. రాత్రి 8 గంటల లోపు తినేయాలి. రాత్రి తేలికపాటి భోజనం చేయండి.. మొక్కజొన్న గంజి లేదా సూప్ వంటివి బెస్ట్. రాత్రి భోజనం చేసిన వెంటనే పడుకునే బదులు, కాసేపు నడవడం అలవాటు చేసుకోండి. దీనితో పాటు, మీరు ప్రతిరోజూ కనీసం 3-4 లీటర్ల నీళ్లు తాగాలి.. మీరు ఈ డైట్ ప్లాన్‌లో తగినంత నిద్ర, క్రమం తప్పకుండా వ్యాయామం కూడా పాటిస్తూ ఉంటే.. ఫలితాలు చాలా త్వరగా కనిపిస్తాయి. వాకింగ్ చేయడం వలన ఫ్యాట్ మెటబాలిజం మెరుగవుతుంది, జీర్ణశక్తి పెరిగి, ఒత్తిడి తగ్గుతుంది. రెగ్యులర్‌గా వాకింగ్ చేయడం వలన శరీర బరువును నియంత్రణలో ఉంచుకోవచ్చు. బరువు తగ్గాలనుకునే వారికి మంచి నిద్ర ఎంతో అవసరం. దీని వలన ఆకలి హార్మోన్స్ నియంత్రణలో ఉంటాయి.రోజుకు కనీసం 7 నుండి 9 గంటల నిద్రపోవడం మంచిది. చక్కెర, స్వీట్లు, జంక్ ఫుడ్‌ను పూర్తిగా నివారించాలి.

# చేతిలో ఉన్న వస్తువు కిందపడిపోతే భవిష్యత్తుకు సంకేతమా?



మన దేశంలో మత గ్రంథాలు, శకునాలు, అశుభ సంకేతాలకు అధిక ప్రాముఖ్యత ఇస్తారు. ఇవి భవిష్యత్తును సూచించే సందేశాలుగా భావిస్తారు. శుభ శకునాలు విజయాన్ని సూచిస్తే, అశుభ సంకేతాలు హెచ్చరికలు లేదా ఇబ్బందులను తెలుపుతాయి. ఉప్పు, నూనె, పాలు వంటివి చేతి నుండి జారిపడటం అశుభంగా పరిగణిస్తారు. వీటి వెనుక మానసిక, సామాజిక అర్థాలు కూడా ఉన్నాయి, అవి మనల్ని మరింత జాగ్రత్తగా ఉండేలా చేస్తాయి. మన దేశంలో చాలా మంది ప్రజలు ఎక్కువగా మత గ్రంథాలు శకునాలు, అశుభ సంకేతాలకు ప్రత్యేక ప్రాముఖ్యతను ఇస్తుంటారు. పురాతన కాలం నుండి మనుషులు మన చుట్టూ ఉన్న ప్రకృతి, జంతువులు, పక్షులు, సంఘటనలు, యాదృచ్ఛికాల ద్వారా భవిష్యత్తు సంకేతాలను గుర్తించడానికి ప్రయత్నించారు. వేదాలు, పురాణాలు, రామాయణం, మహాభారతం, అలాగే జ్యోతిష్యం, శకునాలు, అశుభ సంకేతాలను ప్రస్తావిస్తాయి. శకునం అనేది శుభ సంకేతం. ఇది సానుకూల ఫలితాలు, విజయం, శ్రేయస్సు, భద్రతకు సూచనగా పరిగణించబడుతుంది. అయితే అశుభ సంకేతం అనేది మంచిది కాదని అంటారు. ఇది ఇబ్బందులు, హెచ్చరికల గురించి సూచిస్తుంది. ఉదాహరణకు శుభకార్యాల సమయంలో కుడి వైపు నుండి ఎగురుతున్న పక్షి, దేవుడిని చూడటం లేదా మంచి మాటలు వినడం శుభ సంకేతంగా పరిగణించబడుతుంది. పనికి వెళ్లేటప్పుడు అడ్డంకులను ఎదుర్కొన్నప్పుడు, కొన్ని వస్తువులు పడిపోవడం లేదా ప్రమాదవశాత్తు జరిగిన సంఘటనలను అశుభ సంకేతంగా పరిగణిస్తారు. మతపరంగా ఈ సంకేతాలను దేవుడు లేదా ప్రకృతి నుండి వచ్చిన సూక్ష్మ సందేశాలుగా పరిగణిస్తారు. ఇవి ఒక వ్యక్తి సరైన నిర్ణయం తీసుకోవడానికి సహాయపడతాయి. చెడు శకునాల ప్రాముఖ్యత మూఢనమ్మకాలకే పరిమితం కాదు. వాటి వెనుక మానసిక, సామాజిక అర్థాలు కూడా ఉన్నాయి. చాలా సార్లు చెడు శకునాలు ఒక వ్యక్తి జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తుంటాయి. ఇది అతని నిర్ణయాన్ని మరోసారి పరిశీలించుకునేలా చేస్తుంది. తొందరపడకుండా, సాధ్యమయ్యేంత వరకు ప్రమాదాలను తగ్గించేలా చేస్తుంది. దీనికి విరుద్ధంగా శుభ శకునాలు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి. మనసుకు సానుకూల శక్తిని ఇస్తాయి. పనిలో ముందుకు వెళ్లేందుకు అతన్ని ప్రేరేపిస్తాయి.నూనె ? శాస్త్రాలలో నూనె శని దేవునికి సంబంధించినది. చేతుల నుండి నూనె పదే పదే జారిపడితే, అది భవిష్యత్తులో ఆర్థిక ఇబ్బందులకు సంకేతంగా పరిగణించబడుతుంది. తరచుగా నూనె పడిపోవడం కూడా కుటుంబ సభ్యులను ప్రభావితం చేసే పెద్ద సమస్యకు సంకేతం కావచ్చు. హారతి పళ్ళెం ? పూజ చేస్తున్నప్పుడు హారతి పళ్ళెం చేతి నుండి పడిపోవడం చాలా అశుభ సంకేతంగా పరిగణిస్తారు. హారతి పళ్ళెం చేతి నుండి పడిపోవడం అంటే, దేవుని అసంతృప్తికి సంకేతం కావచ్చు. ఏదైనా శుభ కార్యంలో అడ్డంకులు ఏర్పడటానికి కూడా ఇది సంకేతం కావచ్చునని భావిస్తారు.

## ప్రయాణాల్లో వాంతులు ఎందుకు అవుతాయ్?



ప్రయాణం సమయంలో తల తిరగడం, వాంతులు అవ్వడం లాంటి సమస్యలు రావడాన్ని మోషన్ సిక్ నెస్ అంటారు. కొంతమందిలో ఎక్కువగా ఘాట్ రోడ్లలో ప్రయాణం చేసేటప్పుడు, మలుపుల వద్ద ఇలాంటి సమస్యలు ఎక్కువగా ఫేస్ చేస్తారు. మనం ప్రయాణం చేసేటప్పుడు కళ్ళు, చెవుల నుంచి మెదడుకు వేరు వేరు సంకేతాలు చేరతాయి. బస్సు, కారు, రైలు, విమానం వాహనం ఏదైనా ప్రయాణంలో వామిటింగ్ జరగడం అనేది చాలామందిలో సర్వసాధారణంగా కనిపిస్తుంది. అయితే వైద్యభాషలో దీనిని మోషన్ సిక్ నెస్ అని అంటారు. వెహికల్‌లో ప్రయాణం అవుతున్న సమయాల్లో ఎందుకు జరుగుతుంది అంటే.. ప్రయాణంలో వాంతులు చేసుకోవడానికి మనసు, కళ్ళు, శరీర సమతుల్యత మధ్య కోఆర్డినేషన్ మిస్ అవుతుంది అని పరిశోధకులు చెబుతున్నారు. అయితే ప్రయాణంలో వామిటింగ్ జరగకుండా ఉండడానికి కొన్ని చిట్కాలు పాటిస్తే బాగుంటుందని వారు అంటున్నారు. ప్రయాణం సమయంలో తల తిరగడం, వాంతులు అవ్వడం లాంటి సమస్యలు రావడాన్ని మోషన్ సిక్ నెస్ అంటారు. కొంతమందిలో ఎక్కువగా ఘాట్ రోడ్లలో ప్రయాణం చేసేటప్పుడు, మలుపుల వద్ద ఇలాంటి సమస్యలు ఎక్కువగా ఫేస్ చేస్తారు. మనం ప్రయాణం చేసేటప్పుడు కళ్ళు, చెవుల నుంచి మెదడుకు వేరు వేరు సంకేతాలు చేరతాయి. ప్రయాణంలో ఉన్నప్పుడు కళ్ళు కిందికి గమనిస్తున్నప్పుడు.. మీరు కదలడం లేదని మెదడుకు సంకేతమందుతుంది. కానీ చెవుల్లోని బ్యాలెన్స్ సిస్టం శరీరం కదులుతుందని మెదడుకు చెబుతుంది. ఈ డిఫరెంట్ సంకేతాలు శరీరంలోకి విషపూరితమైన పదార్థాలు ఏదో ప్రవేశించిందని శరీరాన్ని అలర్ట్ చేస్తుంది. దాన్ని ఎలా ఎదుర్కోవాలో శరీరానికి తెలిసిన ఏకైక మార్గం దానిని బయటకు పంపడం అంటే వామిటింగ్ చేసుకోవడం అని ఢిల్లీలోని ప్రముఖ వైద్యులు మొహసిన్ వలి తెలిపారు. ఈ వామిటింగ్ నివారణకు కిటికీలోంచి దూరంగా చూడడం వల్ల కళ్ళు, చెవుల నుంచి వచ్చే సంకేతాలను మెదడు అర్థం చేసుకుని సమతుల్యం చేస్తుంది. దీనివల్ల శరీరానికి కలిగే అసౌకర్యం తగ్గి వాంటింగ్ సెన్సేషన్ తగ్గిపోతుంది. ఈ మోషన్ సిక్ నెస్ అనేది ప్రతి ముగ్గురిలో ఒకరిని ప్రభావితం చేసే అంశంగా వైద్యులు చెప్తున్నారు. ఖాళీ కడుపుతో ప్రయాణం, బాగా తిని ప్రయాణం చేయడం, లాంటివి చేయడం వల్ల కూడా కొంతవరకు ప్రయాణాల్లో వాంతులు జరుగుతుంటాయి.

## ఉదయం లేచినప్పుడు అలసిపోయినట్లు అనిపిస్తుందా?

చాలా మందికి రకరకాల సమస్యలు ఉంటాయి. వాటిని అధిగమించాలంటే రోజు వారీగా కొన్ని పనులు చేయడం చాలా ముఖ్యం. మీరు ఉదయాన్ని నిద్రలేవగానే అలసిపోయినట్లుగా అనిపించినట్లయితే అందుకు కొన్ని కారణాలు ఉన్నాయి. వాటిని నివారించినట్లయితే మీరు హుషారుగా ఉంటారు.శీతాకాలంలో చాలా మంది ఉదయం నిద్రలేచిన తర్వాత బరువుగా, అలసటగా భావిస్తారు. కొంతమందికి బరువు లేదా నొప్పి, శరీర నొప్పులు వంటి సమస్యలు ఎదురవుతాయి. చలి రోజులు సాధారణంగా రోజువారీ దినచర్యకు అంతరాయం, ఎక్కువసేపు నిద్రపోవడం, తక్కువ సూర్యకాంతి మొదలైన వాటి కారణంగా శరీరంలో కొన్ని మార్పులకు కారణమవుతాయి. అయితే ఈ సమస్యలు ప్రతిరోజూ సంభవిస్తే వాటిని సాధారణమైనవిగా విస్మరించకూడదు. ఉదయం నిరంతరం అలసట అనేది శరీరంలోని సమస్యకు సంకేతం కావచ్చు. అందుకే భవిష్యత్తులో మరిన్ని సమస్యలు రాకుండా ఉండాలంటే ఈ సమస్యలకు కారణాన్ని ముందుగానే అర్థం చేసుకోవాలి. నిద్ర నాణ్యత సరిగా లేకపోవడం: ఆలస్యంగా నిద్రపోవడం, మొబైల్ ఫోన్లు వాడటం, అర్ధరాత్రి తరచుగా మేల్కొనడం వల్ల శరీరానికి సరైన విశ్రాంతి లభించదు. దీనివల్ల ఉదయం అలసట వస్తుంది.డీహైడ్రేషన్: చాలా మంది శీతాకాలంలో దాహం తక్కువగా ఉండటం వల్ల తక్కువ నీరు తాగుతారు. డీహైడ్రేషన్ వల్ల కండరాలు బలహీనపడి శరీరం బద్ధకంగా అనిపిస్తుంది.విటమిన్-డి లోపం: చలి రోజుల్లో ఎండ తక్కువగా ఉంటుంది. విటమిన్ డి లోపం వల్ల శక్తి స్థాయిలు తగ్గి అలసట కలుగుతుంది. ఒత్తిడి: అధిక ఆందోళన లేదా ఒత్తిడి మెదడు విశ్రాంతి తీసుకోకుండా నిరోధిస్తుంది. ఇది ఉదయం అలసటకు ప్రధాన కారణం. శారీరక శ్రమ లేకపోవడం: వ్యాయామం లేకపోవడం, ఎక్కువసేపు మంచం మీద పడుకోవడం వల్ల కండరాల చురుకుదనం తగ్గడం, బలహీనత ఏర్పడవచ్చు.మిమ్మల్ని మీరు ఎలా చురుగ్గా ఉంచుకోవాలి: ఎల్లప్పుడూ ఒక నిర్దిష్ట సమయానికి పడుకోవడం, ఉదయాన్నే లేవడం అలవాటు చేసుకోండి. దాహం వేయకపోయినా రోజులో సరైన మొత్తంలో నీరు తాగాలి. ఎండలో కూర్చోవడం: పగటిపూట కొద్దిసేపు ఎండలో కూర్చోవడం వల్ల విటమిన్ డి లభిస్తుంది. మనస్సును తాజాగా ఉంచుతుంది. ఉదయం లేచి కాసేపు నడవడం లేదా తేలికపాటి వ్యాయామాలు చేయడం వల్ల మీ శరీరానికి బలం చేకూరుతుంది. సమతుల్య ఆహారం తీసుకోండి, ఎక్కువ నూనె, కారంగా ఉండే ఆహారాన్ని నివారించండి.

## ఇంట్లో ఇన్సులిన్ ఎలా పెంచాలి?

ఇన్సులిన్ మొక్కను కుండీలో నాటడం చాలా సులభం. మొదట్లో పెరుగుదల నెమ్మదిగా అనిపించవచ్చు. కానీ తర్వాత అది వేగంగా వ్యాపిస్తుంది. బాగా నీరు కారుతున్న కుండీ మట్టిని వాడండి. వర్మి కంపోస్ట్‌లను సమాన భాగాలుగా కలపండి. ఇండోర్ మొక్కలు ఇకపై కేవలం అలంకారంగా మాత్రమే కాదు, ఆరోగ్యాన్ని మెరుగుపరిచే సహజ మార్గంగా కూడా మారుతున్నాయి. ఇన్సులిన్ మొక్క అటువంటి ప్రయోజనకరమైన మొక్క, దాని ఔషధ గుణాలు, ఆకర్షణీయమైన ఆకుల కోసం ప్రజలలో ప్రసిద్ధి చెందింది. మీరు కూడా మీ ఇంట్లో ఇన్సులిన్ మొక్కను నాటాలనుకుంటే ఈ మొక్కల సంరక్షణ కోసం కొన్ని సులభమైన చిట్కాలు ఇక్కడ ఉన్నాయి. శాస్త్రీయంగా కోస్టస్ ఇగ్నియస్ అని పిలిచే ఈ ఇన్సులిన్ మొక్క భారతదేశంలోని వెచ్చని, తేమతో కూడిన ప్రాంతాలకు చెందినది. దీనిని సాధారణంగా "స్పైరల్ ఫ్లాగ్" అని కూడా పిలుస్తారు. దీని విశాలమైన, ప్రకాశవంతమైన ఆకుపచ్చ ఆకులు సర్పిలాకార నమూనాలో పెరుగుతాయి. ఈ మొక్క ఔషధంగా ఉన్నంత అందంగా ఉంటుంది. దీని ఆకులను సాంప్రదాయ వైద్యంలో పరిమిత పరిమాణంలో ఉన్నప్పటికీ, మధుమేహ వ్యాధిగ్రస్తులు ఉపయోగిస్తున్నారు. రోజుకు ఒక ఆకు నమిలితే డయాబెటిస్ అదుపులో ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఈ మొక్క జాగ్రత్తగా పెంచాల్సి ఉంటుంది.

# దీపిక ఇక డేట్ అయిపోయిన హీరోలకే సూటబుల్



దీపిక పదుకొనే బ్యాక్ టు బ్యాక్ బిగ్ బ్లోని ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. ప్రభాస్ సరసన వరుసగా రెండు పాన్ ఇండియా సినిమాల్లో అవకాశం వస్తే, ఆ రెండిటినీ తన అవివేకంతో కోల్పోయిందని చాలా మంది క్రిటిసైజ్ చేస్తున్నారు. ప్రెజెంట్ ఇండస్ట్రీలో ట్రెండింగ్ డైరెక్టర్లుగా పాపులరైన సందీప్ రెడ్డి వంగా, నాగ్ అశ్విన్ లతో కలిసి పని చేసే అవకాశాన్ని కాలరాసుకుంది. ఆ రెండు క్రేజీ ప్రాజెక్టుల నుంచి వైదొలగడమే గాక, తాను తన 18 ఏళ్ల కెరీర్ లో ఒకే హీరోతో ఆరు సార్లు కలిసి పని చేసాను! అంటూ చాలా అమాయకంగా షారూఖ్ పేరును సూచించింది. ఖాన్ నటిస్తున్న కింగ్ సెట్స్ లో చేరినట్టు కూడా వెల్లడించింది. -ఓం శాంతి ఓం-లో నటించినప్పుడు షారూఖ్ నేర్పించిన విద్య గురించి కూడా చాలా ఘనంగా చెప్పుకొచ్చింది. తన వ్యక్తిగత సౌకర్యానికి భంగం కలిగే విధంగా షూటింగులకు హాజరు కాలేనని తెగేసి చెప్పింది. అయితే దీనిపై చాలామంది కొంటె నెటిజనులు టైమింగ్ లీ పంచ్ లు వేస్తున్నారు. కింగ్ ఖాన్ వయసు కొన్ని దినాలు గడిస్తే 60కి చేరుకుంటుంది. షష్ఠిపూర్తికి చేరువవుతారు. ఆయన ఓల్డ్ స్కూల్ ని దీపిక ఫాలో అవుతోందని కొందరు సెటైర్లు వేస్తున్నారు. జమానా కాలంలో ఫార్ములాను ఇప్పటి జెన్ జెడ్ ట్రెండ్ కి అప్లయ్ చేయాలనుకుంటే నష్టపోయేది దీపిక మాత్రమేనని కూడా సూచిస్తున్నారు. 60 ప్లస్ ఖాన్ లతో అవకాశాల కోసం 40 ప్లస్ యువహీరోలతో అవకాశాల్ని కాదనుకోవడం సరికాదని సూచిస్తున్నారు. బ్యాక్ టు బ్యాక్ రెండు సినిమాల్లో 45 వయసు యువకుడైన ప్రభాస్ తో నటించే అవకాశం వస్తే, కాలదన్నుకోవడం అవివేకమని, రెండు సినిమాల రూపంలో ఏకంగా రూ.40 కోట్లు నష్టపోయిందని కూడా విశ్లేషిస్తున్నారు. ఈ నష్టం ఇక్కడితో ఆగిపోదు.. రెండు భారీ చిత్రాల నుంచి తొలగించారనే అపప్రద కారణంగా, ఇతర పెద్ద బ్యానర్లు కూడా అవకాశాలిచ్చేందుకు వెనకాడితే ఆ నష్టం 100 కోట్లు! అని కూడా విశ్లేషిస్తున్నారు. ప్రభాస్ మరోసారి దీపికను పిలిచి అవకాశం ఇవ్వగలడా? అనేది ఒక పెద్ద చిక్కు ప్రశ్న. ఎవరైనా నటి కన్ఫామ్ గా హిట్లు కొట్టే దర్శకులతో ట్రెండ్ లో ఉన్న హీరోతో క్రేజీ సినిమాల్లో నటించినప్పుడే బ్రాండ్ అండార్స్ మెంట్లలోను దూసుకుపోగలదు. ఆ రకంగా వాటికి కూడా గండి పడినట్టేనని కూడా అంచనా వేస్తున్నారు. అసలే కెరీర్ బ్యాడ్ ఫేజ్ లో ఉన్న ఈ సమయంలో దీపిక ఇలాంటి తప్పు చేయకూడదని కూడా సూచిస్తున్నారు.



కావ్య థాపర్ టైమ్‌లెస్ ఎత్నిక్ స్టైల్‌తో ఆకట్టుకుంది



శివంగి వర్మ తాజా స్నాప్‌లలో ఉష్ణోగ్రతను పెంచారు

# మెగా కోడలు మళ్లీ బిజీ బిజీ!



మెగా కోడలు లావణ్య త్రిపాఠి పెళ్లైన దగ్గర నుంచి సినిమాలకు దూరమైన సంగతి తెలిసిందే. కోడలిగా ఇంటి బాధ్యతలకే పరిమితమయ్యారు. పెళ్లైన తర్వాత %-%లీలావతి%-% సినిమాకు కమిట్ అయి పట్టా లెక్కించినా సీరియస్ గా ఆ ప్రాజెక్ట్ పూర్తి చేయలేదు. ఆ సినిమా ఇంకా ఆన్ సెట్స్ లోనే ఉంది. పెళ్లికి ముందు ఓ తమిళ సినిమా కు కమిట్ అయింది. ఆ సినిమా కూడా ఇంకా రిలీజ్ అవ్వలేదు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. త్వరలోనే ఈ సినిమా రిలీజ్ కానుంది.

**కుటుంమంతా సంతోషంగా:**

మరి తాజా పరిణామాల నేపథ్యంలో మెగా కోడలు మళ్లీ సినిమాల్ని సీరియస్ గా తీసుకోతున్నారా? మును పటిలా బిజీ నటిగా మారే ప్రణాళిక సిద్ధం చేస్తున్నారా? అంటే అవుననే లీకులందుతున్నాయి. ఇటీవలే లావణ్య త్రిపాఠి పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చిన సంగతి తెలిసిందే. దీంతో మెగా ఫ్యామిలీ ఫుల్ ఖుషీగా ఉంది. ఇల్లాంతా ఆడ పిల్లలతో నిండిపోయింది వారసుడు కావాలి అంటూ చిరంజీవి అన్న నేపథ్యంలో వరుణ్ తేజ్ కు కొడుకు పుట్టడంతో ఆయనెంతో సంతోషంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో లావణ్య త్రిపాఠి మళ్లీ నటిగా బిజీ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**సినిమాలతో మళ్లీ బిజీ:**

వచ్చే ఏడాది మిడ్ నుంచి మళ్లీ లావణ్య సీరియస్ గా కెరీర్ పై దృష్టి పెట్టే అవకాశం ఉందంటున్నారు. కొత్త సినిమాలతో జోరు పెంచాలని ఆమె కూడా ఆసక్తిగా ఉన్నట్లు వార్తలొస్తున్నాయి. ప్రస్తుతం లావణ్య బాలింత కావడంతో విశ్రాంతిలో ఉన్నారు. కోలుకున్న అనంతరం మళ్లీ స్ట్రాంగ్ కంబ్యాక్ ఇచ్చే ఛాన్స్ ఉంది. ఈ మధ్య కాలంలో ఇండస్ట్రీలో పెళ్లికాని నటీమణులు కంటే పెళ్లైన నటులకే ఎక్కువ డిమాండ్ కనిపిస్తోంది. వరుసగా స్టార్ హీరోలతో అవకాశాలు అందుకునే వారు వారే.

**రెండు ప్రయాణాలు సాఫీగా:**

పారితోషికం కూడా రెట్టింపు అందు కుంటున్నారు. ఈ నేపథ్యంలో లావణ్య కూడా కంబ్యాక్ అవ్వడానికి అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రోఫెషనల్ గా మెగా ఫ్యామిలీ ఎలాంటి అడ్డంకి చెప్పదు.
కావాల్సినంత స్వేచ్ఛ కల్పిస్తున్నారు. ఇప్పటికే నిహారిక కూడా సినిమాలతో యాక్టివ్ అయిన సంగతి తెలిసిందే. చిరంజీవి పెద్ద కుమార్తె సుస్మిత ఇంతకాలం మీడియా కంట కనిపించడం తక్కువైనా? నిర్మాతగా మారిన నేపథ్యంలో సుస్మిత కూడా నెట్టింట వైరల్ అవుతున్నారు. ఇలా మెగా ఫ్యామిలీ నుంచి ఇద్దరు ప్రోపెషనల్ - పర్సనల్ కెరీన్ ని బ్యాలెన్స్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో లావణ్య త్రిపాఠి కూడా స్ట్రాంగ్ కంబ్యాక్ ఇచ్చే అవకాశాలు ఎక్కువగానే ఉన్నాయి.